Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

V A S BHASKAR
+91 9063233197
yas.bhaskar@yahoo.co.in
EPF
ESIC
LABOUR OFFICE
PSARA LICENCES
CLIENT AUDITS
SECURITY SERVICES
PAYROLL

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 282 విశాఖపట్నం, 28 ఆగస్టు 2024 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## సీఎం చంద్రబాబుతో నీతిఆయోగ్ ప్రతినిధుల భేటీ



అమరావతి: సీఎం చంద్రబాబుతో నీతిఆయోగ్ ప్రతినిధులు భేటీ అయ్యారు. వికసిత్ ఏపీ -2047 రూపకల్పనపై చర్చించారు. 2047 నాటికి ఏపీని 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని నీతి ఆయోగ్ ప్రతినిధులకు సీఎం స్పష్టం చేశారు. అందుకే ఏపీ విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మాక్రో టు మైక్రో విధానం అవలంబించేలా చర్యలు తీసుకోనున్నట్లు సీఎం వెల్లడించారు. వచ్చే ఐదేళ్లకు జిల్లాల వారీగా విజన్ డాక్యుమెంట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఏపీని హై వాల్యూ అగ్రి ప్రాసెసింగ్ హబ్‌గా రూపొందించడంతో పాటు పారిశ్రామికంగా యువతలో నైపుణ్యం పెంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు చెప్పారు. దేశ తూర్పుతీరానికి ఏపీని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.


పరిశ్రమలు, పునరుత్పాదక విద్యుదుత్పత్తి కేంద్రంగా ఏపీని తీర్చి దిద్దేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏపీని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ నగరాలను గ్రోత్‌సెంటర్లుగా మారుస్తామని, అందరికీ అత్యాధునిక వైద్యసేవలు అందేలా

(మిగతా 2లో)

## రష్యా అధ్యక్షులు పుతిన్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోదీ

భారతదేశం - రష్యాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించే మార్గాలపై దృష్టి సారించారు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ. ఈ నేపథ్యంలోనే మంగళవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా, రష్యా-ఉక్రెయిన్ వివాదంపై ఇరువురు నేతలు అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

"విశేషమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి చర్చించాం. రష్యా-ఉక్రెయిన్ వివాదంపై అభిప్రాయాలను మార్పిడి చేసుకున్నారు. ఇటీవలి ఉక్రెయిన్ సందర్శన ద్వారా పొందిన విషయాలను ఇరు దేశాల మధ్య పంచుకున్నాం" అని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ సంఘర్షణకు శాశ్వత, శాంతియుత పరిష్కారం అవసరం." అన్ని



స్పష్టం చేశారు. ఉక్రెయిన్ పర్యటన తర్వాత అక్కడి, పరిస్థితులు, శాంతి నెలకొల్పేందుకు తీసుకోవాల్సిన విధానాలపై పుతిన్‌తో ప్రధాని మోదీ విస్తృతంగా చర్చించారు. వీరి మధ్య ఫోన్‌లో సుదీర్ఘ సంభాషణ జరిగినట్టు సమాచారం.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలి ఉక్రెయిన్ పర్యటించారు. గత వారం పోలాండ్, ఉక్రెయిన్ సందర్శించారు. యుద్ధంలో దెబ్బతిన్న ఉక్రెయిన్‌ను సందర్శించి, అక్కడ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీని కలిసిన నాలుగు రోజుల తర్వాత ఇద్దరు నేతల మధ్య తాజా చర్చలు జరిగాయి. ఉక్రెయిన్ నాయకుడితో చర్చల సందర్భంగా, దౌత్యం ద్వారా యుద్ధాన్ని పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్ ప్రెసిడెంట్‌తో తన భేటీలో, భారతదేశం ఎల్లప్పుడూ శాంతికి అనుకూలంగా ఉంటుందని మోదీ స్పష్టం చేశారు.

"భారతదేశం తటస్థంగా లేము, మొదటి నుండి శాంతి పక్షం వహించాం. శాంతి వైపు ఎంచుకున్నాం. యుద్ధానికి చోటు లేని బుద్ధుడి దేశం నుండి వచ్చాం" అని ప్రధాని అన్నారు. "రాజ్యాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించడానికి భారతదేశం కట్టుబడి ఉందని, ఇది చాలా ముఖ్యమైనదని, మొత్తం ప్రపంచ సమాజానికి హామీ ఇస్తున్నాను" అని ఉక్రెయిన్ పర్యటనలో ప్రధాని అన్నారు.

గత నెలలో మోదీ

(మిగతా 2లో)

## ఐదేళ్ల పాటు జగన్, భారతి, అవినాష్‌రెడ్డి ఇబ్బంది పెట్టారు: దస్తగిరి

కడప: ఐదేళ్ల పాటు జగన్, భారతి, అవినాష్‌రెడ్డి తనను ఇబ్బంది పెట్టారని మాజీమంత్రి వివేకా హత్య కేసు అప్రూవర్ దస్తగిరి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కడపలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. "భాస్కర్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి నన్ను ఇబ్బందులకు గురి చేశారు. వైకాపా హయాంలో పోలీసులు కట్టు బానిసలుగా పనిచేశారు. జైల్లో అధికారులు నన్ను హింసించారు. వైకాపా నేతలకు కడప జైలు సూపరింటెండెంట్ ప్రకాశ్ తొత్తుగా మారారు. దేవిరెడ్డి శివ శంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి నన్ను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. వివేకా హత్య కేసులో రాజీ కావాలని డబ్బు ఆశ చూపారు. చైతన్యరెడ్డి మాట వినకపోవడంతో జైల్లో నన్ను హింసించారు. నేను జైల్లో ఉన్న సమయంలో

(మిగతా 2లో)





## రిజిస్ట్రార్‌కు అభినందనల వెల్లువ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావును మంగళవారం పెద్దసంఖ్యలో ఆచార్యులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయ రావును ఏయూ మాజీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్ రాజు, ఐఐపిఈ మాజీ డైరెక్టర్ ఆచార్య వి.ఎస్.ఆర్.కె ప్రసాద్, ఏయూ ప్రిన్సిపాల్స్ ఆచార్య ఏ.నరసింహా రావు, ఆచార్య జి.గిరిజా శంకర్, కె.సీతామాణిక్యం, గ్రంధాలయ సిబ్బంది, విశ్రాంత బోధనేతర ఉద్యోగుల సంఘం సభ్యులు, విశ్రాంత ఆచార్యులు, వివిధ డీన్‌లు, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, విభాగాధిపతులు, పరిపాలనా కార్యాలయ విభాగా సిబ్బంది, అధికారులు, పరిశోధకులు, విద్యార్థులుపెద్దసంఖ్యలో శుభాకాంక్షలు తెలియజేశారు.

## దుర్వాసన కలుగకుండా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటును ఆధునీకరించండి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జి.వి.యం.సి పరిధి లో గల కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ వద్ద వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లో దుర్వాసన కలుగకుండా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను అధునీకరించుటకు చర్యలు చేపట్టేలా జిందాల్ ప్రతినిధులకు ఆదేశించాలని జీవీ ఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ ను రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు పి.నారాయణ ఆదేశించారు.

మంగళవారం ఆయన విశాఖ జిల్లా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ చేపట్టే పలు కార్యక్రమాలపై సమీక్షించేందుకు విశాఖ నగర సందర్శనలో భాగంగా విశాఖ కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ లోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను, బయోమైనింగ్ ప్లాంటు ను భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ తో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులప్పాడ డంపింగ్ యార్డ్ లో దుర్వాసన కలుగకుండా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను ఆధునికరించాలని అధికారులకు, జిందాల్ ప్రతినిధులకు ఆదేశించారు. అలాగే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటు లో సేకరించిన వ్యర్థాలు నుండి విద్యుత్తు తయారీ ప్రక్రియను, టిప్పింగ్ ఫ్లోర్, ఎంఎస్‌డబ్ల్యూ పిట్,గ్రాబ్ క్రేన్ కంట్రోల్ రూమ్, 25 మీటర్ల ఎత్తు ఉన్న ప్లాట్‌ఫారమ్‌లో రెండు బాయిలర్లు, లెచాట్. ట్రీట్‌మెంట్ ప్లాంట్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఫ్లూ గ్యాస్ క్లీనింగ్ సిస్టమ్,చిమ్నీ, టి.జి. హాల్, డిసిఎస్ కంట్రోల్ రూమ్, మోటార్ కంట్రోల్ రూమ్, బాటమ్ యాష్ కన్వీనర్ మొదలైన వాటి పనితీరును, విధానాలను పరిశీలించారు. నగరంలో ప్లాంట్ కు రోజుకు ఎన్ని టన్నుల వ్యర్థాలు వస్తుంది, ఎంత విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని అధికారులను ఆరా తీయగా జిందాల్ అపరేషన్ ప్రెసిడెంట్ ఎం.వి.చారి నగరం నుండి రోజుకు కనిష్టంగా 680 నుండి గరిష్టంగా 1400 మెట్రిక్ టన్నుల వ్యర్థాల సేకరణ జరుగుతుందని, ఒక గంటకు 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలియజేస్తూ, ప్లాంట్ లో వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ ను స్క్రీన్ పై మంత్రి వర్యులకు వివరించారు.



అనంతరం మంత్రి ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ, గతంలో టోక్యో, జపాన్, సింగపూర్ తదితర దేశాల్లో మంత్రి పర్యటించి వ్యర్థాల సేకరణ వాటి వినియోగం పునరుత్పత్తి మొదలైనవి అధ్యయనం చేశామని, 100 అంతస్తుల అపార్ట్మెంట్లు వున్న మధ్యలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లు ఉన్నాయని, అవి ఎక్కడా కూడా దుర్వాసన వెదజల్లదని, ఆ విధంగా, విశాఖ ప్రజలకు ఎటువంటి హాని, దుర్వాసన కలుగకుండా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటును ఆధునికరించాలని అధికారులకు ఆదేశించడమైనదని, ఎనర్జీ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్వహణ బాగుందని, మరింత ఆధునికరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించడమైనదని మంత్రి నారాయణ తెలిపారు.

అనంతరం భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరం నుండి దాదాపు 1000 టన్నుల వరకు వ్యర్థాలు సేకరించడం జరుగుతుందని, దీనిని పలు విభాగాలుగా

(మిగతా 2లో)

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు



**ఢిల్లీ:** మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, ఈడీ తరఫున ఏఎస్‌జీ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం కవితకు బెయిల్ మంజూరు చేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. బెయిల్ మంజూరుకు సుప్రీంకోర్టు మూడు ప్రధానమైన కారణాలు చెప్పింది. సీబీఐ తుది ఛార్జిషీట్ దాఖలు చేసిందని.. ఈడీ కూడా దర్యాప్తు పూర్తిచేసిందని పేర్కొంది. నిందితురాలు జైలులో ఉండాల్సిన అవసరం లేదంది. మహిళగా కూడా పరిగణించాల్సి ఉందని అభిప్రాయపడింది. అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది.

కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఈ ఏడాది మార్చి 15న అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అరెస్ట్ చేసినట్లు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్ అప్పట్లో ప్రకటించారు. అరెస్ట్ వారెంట్‌తో ఆమె ఇంటికి వెళ్లిన ఈడీ అధికారులు తొలుత సోదాలు నిర్వహించి, మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం విచారించి కవిత వాంగ్మూలం నమోదు చేశారు. ఆమె నుంచి ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కవితను తిహాడ్ జైలుకు తరలించారు.

ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ 2022 ఆగస్టులో సీబీఐ కేసు నమోదు చేసింది. ఇదే కేసులో హైదరాబాద్‌కు చెందిన మద్యం వ్యాపారి అరుణ్ రామచంద్రపిళ్లై వాంగ్మూలాన్ని సేకరించిన అనంతరం కవితకు నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఢిల్లీ మద్యం టెండర్ల వ్యవహారంలో సౌత్ లాబీ తరఫున రూ.కోట్లు చేతులు మారాయనే కోణంలో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అరుణ్ రామచంద్రపిళ్లై రిమాండ్ నివేదికలో

(మిగతా 2లో)

## మంత్రి నారా లోకేశ్ సమక్షంలో తెదేపాలో చేరిన ఏలూరు మేయర్





**అమరావతి**: ఏలూరులో వైకాపాకి భారీ షాక్ తగిలింది. నగర మేయర్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి) నేతృత్వంలో మంత్రి నారా లోకేశ్ సమక్షంలో తెదేపాలో చేరారు. వీరితో పాటు ఈయూడీఏ మాజీ ఛైర్మన్, ప్రస్తుత వైకాపా పట్టణ అధ్యక్షుడు బి.శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎం.మైబాబుతో పాటు పలువురు వైకాపా నేతలు సైకిలెక్కారు. ఉండవల్లిలోని తన నివాసంలో వీరందరికీ మంత్రి లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఎన్నికల్లో ఓటమి నుంచి వైకాపా గుణపాఠం నేర్చుకోలేదని, ప్రజా ప్రభుత్వంపై నిత్యం దుష్ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతున్నారని లోకేశ్ ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. ఏలూరు అభివృద్ధి కోసం కలిసి వచ్చే వారికి స్నేహ హస్తం అందిస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ఆళ్ల నాని వైకాపా కార్యకర్తలను వదిలేసి పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేవారిని తెదేపాలో చేర్చుకుంటున్నామని వెల్లడించారు. త్వరలోనే దశలవారీగా కార్పొరేటర్లు తెదేపాలో చేరబోతున్నారని తెలిపారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో

(మిగతా 2లో)

పి ఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన

9347052341 : వాట్సాప్



9347052341 కి కాల్ చేసి
మాఇంటికి పై 5 కి. వాట్, సోలార్, పిఎం
ముఫ్తీ బిజిలీ యోజన, 'యమ్ ఎస్ ఎల్'
వారి అనుభవం కల్గిన సాంకేతిక
నిపుణులు,సమయానికి, సంతృప్తి
కరంగా చేసారు. వీరిని పరిచయం
చేసినది 'నెడ్కేప్' డీ ఎం, శ్రీ రాజుగారు.

బి. సూర్యప్రకాశరావు
ప్రొఫెసర్ ఏయు ఇంజనీరింగ్ కాలేజ్, విశాఖపట్నం

## (మొదటి పేజీ తరువాయిలు)

### సీఎం చంద్రబాబుతో నీతిఆయోగ్ ప్రతినిధుల భేటీ

చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పర్యావరణ అనుకూల అభివృద్ధిపై దృష్టిపెట్టేలా ప్రణాళికలను సీఎం వివరించారు. డిజిటల్ గవర్నెన్స్, ఆర్థికాభివృద్ధికి ఏపీని ఓ నమూనాగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### రష్యా అధ్యక్షులు పుతిన్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోదీ

మాస్కోను సందర్శించి పుతిన్‌ను కలిశారు. ఇందులో ఉక్రెయిన్ వివాదంపై భారత్ వైఖరిని పునరుద్ఘాటించారు. చర్చలు, దౌత్య మార్గానికి తిరిగి రావాలని రష్యా అధ్యక్షుడిని మోదీ ప్రోత్సహించారు. "యుద్ధభూమిలో ఎటువంటి పరిష్కారం దొరకదని" నొక్కి చెప్పారు.

### ఐదేళ్ల పాటు జగన్, భారతి, అవినాష్‌రెడ్డి ఇబ్బంది పెట్టారు: దస్తగిరి

సీసీ ఫుటేజీని తొలగించారు. నాటి ఘటనలపై విచారణ చేయాలని ఎస్పీ, సీబీఐని కోరుతున్నా. తప్పు చేసిన వాళ్లకు శిక్ష పడాల్సిందే" అని దస్తగిరి అన్నారు.

### దుర్వాసన కలుగకుండా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటును ఆధునీకరించండి

విభజించి విద్యుత్ ఉత్పత్తి, సేంద్రియ ఎరువు, బ్రిక్స్ మొదలైన విధాలుగా తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే కాపులుప్పాడ డంపింగ్ యార్డును ఆధునీకరించేందుకు మరింత కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం మున్సిపల్ మంత్రి బయో మైనింగ్ ప్లాంటును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు .

ఈ పర్యటనలో జివిఎంసి తెలుగుదేశం పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పిసిని వరహాలక్ష్మి నరసింహం, మొల్లి హేమలత, వి.ఎం.ఆర్.డి.ఎ. జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, ప్రధాన ఇంజనీరు వినయ్ కుమార్, జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, సి.ఎం.ఒ.హెచ్. డాక్టర్ నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీరు (మెకానికల్) కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ కవితకు బెయిల్.. మంజూరు

అతడిని కవిత బినామీగా పేర్కొంది. ఈ సౌత్ గ్రూప్ ద్వారా రూ.100కోట్ల ముడుపులు ఆప్‌కు హవాలా మార్గంలో అందాయని అభియోగం మోపింది. గతేడాది మార్చిలో కవితకు నోటీస్ జారీ చేసి విచారించింది. ఆ తర్వాత మరోమారు కూడా సమన్లు జారీ చేసింది. అవి మహిళలకు ఉన్న హక్కులను ఉల్లంఘించేలా ఉన్నందున వాటిని కొట్టేయాలని ఆమె గత ఏడాది మార్చి 15న సుప్రీంకోర్టును ఆశ్రయించి అప్పట్లో ఉపశమనం పొందారు. సరిగ్గా ఈ ఏడాది అదే రోజు ఆమెను ఈడీ అరెస్టు చేసింది.

### మంత్రి నారా లోకేశ్ సమక్షంలో తెదేపాలో చేరిన ఏలూరు మేయర్

గతంలో.. తెలుగుదేశం వీడి వైకాపాకు వెళ్లాల్సి వచ్చిందని ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఆ పార్టీలోకి వెళ్లాక ఏమాత్రం అభివృద్ధి చేయలేకపోయామన్నారు. దాదాపు 40మంది కార్పొరేటర్లు త్వరలోనే తెలుగుదేశంలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

### శ్రీకృష్ణ భగవానుని లీలలను ప్రదర్శించిన శ్రీకృష్ణ విద్యామందిర్ విద్యార్థులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ద్వారకానగర్ లోని శ్రీకృష్ణ విద్యా మందిర్ లోని విద్యార్థులు శ్రీకృష్ణ భగవానుని లీలలను ప్రదర్శించారు. వివేకానంద, శ్రీ కృష్ణ దేవరాయ, శివాజీ. రామన్ పలు సన్నివేశ లు పారిజాతాపహరణం, జాంబవతీ పరిణయం, విద్యార్థులు శ్రీ కృష్ణ జననం " దేవళ్ళ పూజ వంటి సన్ని వేశాలను కళ్ళకు కట్టినట్లుగా కనులవిందుగా ప్రదర్శించారు. "నారాయణీయం" కార్యక్రమంలో భాగంగా ఈ కార్య క్రమం జరుపబడింది. తరువాత ఉట్టి కొట్టి కార్యక్రమం ఎంతో వేడుకగా జరిగింది. పలువురు బాల బాలికలు శ్రీకృష్ణ, వేష ధారణలో బాల గోకులం" లో అలరించారు. ఉదయం శ్రీకృష్ణ పూజ నిర్వహించబడింది. పూజానంతరం నాలుగు హౌస్ల విద్యార్థులచే యశోద, రాధాదేవి, కుబ్జి, మీరాబాయి వంటి పాత్రల ఔన్నత్యాన్ని గూర్చి విద్యార్థులు తెలియజెప్పారు . కృష్ణుని తత్వాన్ని, కృష్ణ భక్తిని తెలిపేవిధంగా భజనలు, పాటలతో విద్యార్థినీ విద్యార్థులు ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గాడా.. జె.వి.యస్. ఎన్ మూర్తిగారు, డా. కృష్ణవేణి. తిరుణ, శ్రీమతి విజయ న్యాయమూర్తులుగా విచ్చేశారు .

సాయంత్రం 4గం.లకు నారాయణీయం" కార్యక్రమం శ్రీ మతి జ్యోతి ప్రజ్వలనం తో ప్రారంభ మైంది. ఈ కార్యక్ర మానికి న్యాయనిర్ణేతలుగాడా. పి.కె. జయలక్షిగారు డా. నిర్మలాదేవి, డా. రాజ శేఖర్ విచ్చేశారు. మన సంస్కృతీ - సంప్రదాయాలను ప్రతి బింబించే విధంగా విద్యార్థులు ప్రదర్శించిన సన్నివేశాలను తిలకించి, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానాచార్యులైన V. నర్మద పర్యవేక్షణలో ఘనంగా జరిగింది'

## ఐశ్వర్యవేంకటేశ్వర ఆలయం లో కృష్ణాష్టమి వేడుకలు





**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక కీటిన్ పేట వద్దగల ఐశ్వర్యవేంకటేశ్వర ఆలయం లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ట్రస్టీలు ఆధ్వర్యంలో ముందుగా శ్రీకృష్ణ పెరుమాళ్ వారి సన్నిధిలోభక్తుల కోలాహలం నడుమ ఉట్టికొట్టు సంబరం జరిగింది.అనంతరం అర్చకులు స్వామి వారికి పంచామృతభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి 12 రకాల పిండివంటలను నివేదన చేసారు.స్వామి వారిని దర్శించుకొన్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమం లో అర్చకులు పురాణం శేషాచార్యులు, విష్ణు, ముప్పిరాల ఆనంతాచార్యులు, ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి, సూర్యనారాయణ మూర్తి, భానోజిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## శిశు విక్రయాలుకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో ఎక్కడైనా శిశు విక్రయాలు జరిపిన వారిపై కేసులు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు హెచ్చరించారు. ఈ రోజు విశాఖపట్నం లో ఇటీవల కాలంలో శిశు విక్రయాలులో భాగంగా 9 మంది చిన్నారులును గుర్తించి వారిని శిశు గృహంలో సంరక్షణ కల్పించిన నేపథ్యంలో ఈ రోజు సందర్శించి జరిగిన సంఘటన పై ఆరా తీయడం జరిగింది.

ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో తరచుగా శిశు విక్రయాలు జరుగుతున్నట్లు కమిషన్ దృష్టికి రావడం జరుగుతుందని అటువంటి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అంతేకాకుండా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సంబంధిత అధికారులు అనగా వైద్య ఆరోగ్య సిబ్బందికి, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖ, సచివాలయం సిబ్బంది,స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ విద్యా శాఖ మొదలగు శాఖలు కు కీలక ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. చట్టబద్ధమైన దత్తత గురుంచి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. శిశుగృహ కేంద్రాన్ని సచివాలయం సిబ్బంది అయిన మహిళా సంరక్షణ కార్యదర్శి, ఆరోగ్య కార్యకర్తలు తరచుగా సందర్శించాలని సూచించారు. అపరిచితులు, ఇతరులును అనుమతించరాదని ,సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని.అంకిత భావంతో పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీడీపీవో ఎం వి ఆర్ కుమారి,. శిశు గృహ మేనేజర్ ఏ సుజాత. సోషల్ వర్కర్ ఎస్ వీ రామ లక్ష్మి మహిళా సంరక్షణ కార్యదర్శి భవాని పాల్గొన్నారు.

## అన్ని పరిశ్రమల్లో నిర్దేశిత ప్రమాణాల మేరకు భద్రత తప్పనిసరి

**విజయనగరం:** జిల్లాలో అన్ని పరిశ్రమలు తమ సంస్థల్లో భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా నిర్దేశిత ప్రమాణాల మేరకు ఆయా భద్రత ఏర్పాట్లను వారం రోజుల్లోగా పూర్తిచేసి అంతర్గత ఆడిట్ నివేదికను అందజేయాలని పరిశ్రమల యాజమాన్యాలకు స్పష్టంచేశారు. జిల్లాలోని పరిశ్రమల్లో చేపట్టాల్సిన భద్రత చర్యలపై సమీక్షించేందుకు ఆయా పారిశ్రామిక యాజమాన్యాలతో కూడిన జిల్లా స్థాయి క్రైసెస్ మేనేజ్‌మెంట్ గ్రూపు సమావేశం ఫ్యాక్టరీల తనిఖీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.అంబేద్కర్ మాట్లాడుతూ అంతర్గత ఆడిట్ పూర్తయినట్లు తెలియజేస్తే ఆయా పరిశ్రమలను జిల్లా స్థాయి అధికారులు, నిపుణులతో కూడిన కమిటీలు తనిఖీ చేసి భద్రతకు నిర్దేశిత ప్రమాణాల మేరకు అన్ని చర్యలు తీసుకున్నదీ లేనిదీ నిర్ధారిస్తాయని పేర్కొన్నారు.

పరిశ్రమల్లో భదత్ర చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు అత్యవసరంగా యీ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలు భద్రత చర్యలు చేపట్టడంతోపాటు భద్రత చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించి ఏవైనా ఘటనలు, ప్రమాదాలు జరిగినపుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పరిశ్రమ తమ సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల భద్రతను కూడా అత్యంత ప్రాధాన్యత అంశంగా భావించి ఆమేరకు ఉద్యోగుల్లోనూ భద్రత పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై తగిన అవగాహన కలిగించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా పరిశ్రమల్లో తరచుగా తనిఖీలు నిర్వహిస్తూ ఆయా పరిశ్రమలు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం భద్రత చర్యలు చేపడుతున్నదీ లేనిదీ నిర్ధారించుకోవాలన్నారు. ఆయా ఫ్యాక్టరీల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కూడా భద్రత చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ప్రతి పరిశ్రమకూ ఏదైనా ప్రమాదం లేదా విపత్తు జరిగినపుడు తక్షణం ఎలా స్పందించాలి, ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై ఒక స్పష్టమైన ప్రణాళిక వుండాలని జిల్లా పోలీసు సూపరింటెండెట్ వకుల్ జిందాల్ చెప్పారు. అన్ని పరిశ్రమలు అన్నిరకాల భద్రత ప్రమాణాలు పాటించాలని అందులో రాజీలేదని స్పష్టంచేశారు. ప్రమాదాలు లేని జిల్లాగా రూపొందించడంలో అన్ని పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

పరిశ్రమలు తమ వద్ద వున్న భద్రత ప్రమాణాలను పునఃసమీక్షించుకోవాలని, అవి ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగినవిధంగా వున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించి అప్‌గ్రేడ్ చేసుకోవాలని జాయింట్




కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కోరారు. తమ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం వున్న విభాగాలను గుర్తించి వాటి పనితీరు, నిర్వహణపై నిత్యం నిఘా పెట్టాలన్నారు. ప్రతి సంస్థ భద్రత చర్యలకు సంబంధించి ఒక సేఫ్టీ సూపర్ వైజర్‌ను నియమించుకోవాలని సూచించారు. ప్రమాదకర రసాయనాలు నిల్వ చేసే ట్యాంకులు ఏవైనావుంటే వాటిని తరచుగా గమనించాలన్నారు. పరిశ్రమలో ఎలక్ట్రికల్ సర్క్యూట్‌లు సక్రమంగా వున్నదీ లేనిదీ నిత్యం తనిఖీలు చేస్తూ వుండాలన్నారు.

ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు భారీ పరిశ్రమలు వున్నాయని తెలిపారు. ఈ పరిశ్రమల్లో చేపట్టిన భద్రత చర్యలపై ఎస్.ఎం.ఎస్.ఫార్మా, హెచ్.బి.ఎల్., మైలాన్ సంస్థల ప్రతినిధులు వివరించారు. ఇటీవలి కాలంలో తమ సంస్థల్లో ఎటువంటి భారీ ప్రమాదాలు చోటు చేసుకోలేదని వారు తెలిపారు.

ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ డి.డి. కోటేశ్వరరావు, ఆర్.డి.ఓ.లు ఎం.వి.సూర్యకళ, బి.శాంతి, సుధారాణి, డిప్యూటీ లేబర్ కమిషనర్ సుబ్రహ్మణ్యం, కాలుష్య నియంత్రణ మండలి ఇ.ఇ. సరిత, ఏపిఐఐసి అధికారులు మురళీమోహన్, రామకృష్ణ, అగ్నిమాపక అధికారులు, జిల్లాలోని వివిధ పారిశ్రామిక సంస్థల యాజమాన్య ప్రతినిదులు పాల్గొన్నారు.

## పార్టీ లో నిబద్ధతతో పనిచేసేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుంది



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** పార్టీ పట్ల అంకితభావం తో నిబద్ధత కలిగి పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. స్థానికం గా గల పార్టీ కార్యాలయం లో పార్టీ సీనియర్ నాయకులు గిడుతూరి శ్రీనివాసరావు (డెక్కన్ శ్రీను)45 వ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనం గా జరిగాయి. కార్యక్రమం లో ముఖ్య అతిధిగా హాజరైన గంటా నూకరాజుతో పాటు నాయకులు శ్రీను చే కేక్ కట్‌జేసి పూలమాలలు వేసి శాలువ కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నూకరాజు మాట్లాడుతూ పార్టీ లో క్రియాశీలక కార్యకర్త గా నాయకుడిగా ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం శ్రీనివాస్ చాలా కృషి చేస్తున్నారని అన్నారు. ఒక పక్కన రాజకీయాల్లో ఉంటూ మరోపక్క "డెక్కన్" దిన పత్రికను స్థాపించి ప్రజా సమస్యల కోసం శ్రీనివాస్ కృచేయడం అభినందనీయం అని ఆయన అన్నారు. కార్యక్రమం లో పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవ్ కుమార్, కొక్కిరి అప్పన్న, అప్పికొండ నూకరాజు, సత్యారావు, మురళీ, నర్సింగరావు,వంశీ తదితరులు పాల్గొన్నారు.

### పంచాంగం

బుధవారం 28-08-2024
క్రోధి నామ సంవత్సరము
దక్షిణాయణం, వర్షరుతువు
శ్రావణ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. దశమి తె. 04.09 |
| నక్షత్రం | : మృగశిర రా. 08.09 |
| వర్జ్యం | : తె. 04.52 ల 05.32 |

## భూ భాదితుల సదస్సును జయప్రదం చేయండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 28 న విజయవాడ లో జరగనున్న భూ భాదితుల సదస్సు ను విజయవంతం చేయాలని సిపిఐ మధురవాడ శాఖ కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ పిలుపు నిచ్చారు.సదస్సు గోడ పత్రికను పార్టీ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ బకాసురుల కోరల్లో చేరిన భూములను కాపాడి ఎన్నో సంవత్సరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్న పేదలకు పట్టాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకురాలు పెంటపల్లి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో. స్థానిక చౌడేశ్వరి సాంబశివుని దేవాలయంలో. విశ్వహిందూ పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. కృష్ణాష్టమి విశ్వహిందూ పరిషత్ స్థాపన దివస్. ఈ సందర్భంగా బాల బాలికలకు శ్రీ కృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించడం జరిగింది. ఇందులో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు. పాల్గొన్న వారందరికీ భాగవతము శ్రీకృష్ణుని కథలు జీవిత కథలు పుస్తకాలు అందరికీ ఇవ్వడం జరిగింది. మెమెంటోస్ బహుకరణ బిఎస్ గుప్తా, ఈ కార్యక్రమములో నందన శర్మ, పూజ్యం వెంకట నాగబాబు, ఆరవెల్లి సాయి ప్రదీప్, కటకం లక్ష్మణరావు, ఐవీ కుర్మనాజ్, శ్రీకాళహస్తి, న్యాయ నిర్ణయతలుగా. బి అచ్యుతాంబ, ఎస్ పెద్దమ్మ పాల్గొన్నారు.

## నిలిచిన ఈవిఎం పరిశీలన




**విజయనగరం:** విజయనగరం పార్లమెంటు స్థానంలో వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన బెల్లాన చంద్రశేఖర్ చేసిన ధరఖాస్తు మేరకు, ఈవిఎం పరిశీలనకు ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బెల్లానకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నుంచి నోటీసు ఇవ్వగా, ఆయన మంగళవారం ఉదయం 10 గంటలకు నెల్లిమర్ల ఈవిఎం గోదాములవద్దకు చేరుకున్నారు. తాను ఎంపిక చేసుకున్న పోలింగ్ కేంద్రం కంట్రోల్ యూనిట్ బ్యాటరీ పవర్ పర్సంటేజ్‌ను ఆయన అడిగారు. అయితే ఈసిఐ ప్రస్తుత టెక్నికల్ ఎస్ఓపిలో బ్యాటరీ పవర్ పర్సంటేజ్ లేదని భెల్ ఇంజనీర్లు, అధికారులు వారికి తెలియజేశారు. దీంతో ఈవిఎం పరిశీలనకు బెల్లాన నిరాకరించినందువల్ల, ఈవిఎం పరిశీలన జరగలేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలోతెలిపారు.

విశాఖ సమాచారమ్

బుధవారం 28-08-2024

## అంతిమ లక్ష్యం

జీవితం యొక్క అంతిమ లక్ష్యం శాశ్వతమైన ఆనందం మరియు శాశ్వతమైన శాంతి పొందడం. జీవితం యొక్క నిజమైన ప్రయోజనం యొక్క ఈ స్థితిని ఎలా సాధించాలో పురాతన భారతీయ గ్రంథాలలో చాలా చెప్పబడింది. ఈ సందర్భంలోనే మనకు భారతీయ సంప్రదాయంలో ఒక అందమైన పద్యం కనిపిస్తుంది, ఇది శాశ్వతమైన ఆనందం వైపు ప్రయాణానికి ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుంది.

**శ్లోకం :**

**విద్యా దదాతి వినయం వినయాద్ యాతి పాత్రతం .**

**పత్రత్వాత్ ధనమాప్నోతి ధనాత్ ధర్మం తతః సుఖం ..**

ఇది నారాయణ పండితుని హితోపదేశం (0.6)లో కనిపించే చాలా ప్రజాదరణ పొందిన శ్లోకం.

విద్యతో (జ్ఞానంతో) వినయం చేకూరుతుంది. ఆ వినయంతో అర్హత (పాత్రత) లభిస్తుంది. పాత్రత వల్ల ఎలాగూ ధనం సమకూరుతుంది. ఆ ధనములోంచి కొంత దానం చేసి సుఖాన్ని పొందవచ్చు. ఇక్కడ కేవలం విద్య యొక్క ప్రాముఖ్యతని మాత్రమే వివరించలేదు. దానివలన వ్యక్తిత్వం బలపడుతుందనీ, మనిషి సామర్థ్యం మెరుగుపడుతుందనీ, భౌతికమైన సంపదనీ పొందగలుగుతామనీ, పదిమందికీ ఉపయోగపడేలా దానమూ చేయగలుగుతామని చెబుతున్నాడు కవి. అంటే ఇక్కడ సుఖం అనేది ఒక్క భౌతికంగానే కాదు సర్వతోముఖంగా ఉంది. విద్యతో ఇహమూ పరమూ సిద్ధిస్తాయని ఈ పద్యం చెబుతోంది. నిజమైన అభ్యాసం వినయంతో తనను తాను సిద్ధం చేసుకుంటుందని దీని అర్థం. నిజమైన అభ్యాసం లోతుగా ఉన్నప్పుడు, జ్ఞానం నిజమైన దానితో పోలిస్తే ఎంత చిన్నదో అర్థం అవుతుంది. చాలా సార్లు ఒక వ్యక్తి తన చిన్న అభ్యాసంతో మోహానికి లోనవుతాడు మరియు గొప్పవాడు లేడని ఆలోచించడం ప్రారంభిస్తాడు. 'చిన్న అభ్యాసానికి' పరిమితమైతే అది మరింత అహంకారాన్ని సృష్టిస్తుంది. ఈ ఆలోచన ఒకరి వినయాన్ని చంపివేస్తుంది మరియు ఒక వ్యక్తి మరింత అహంకారాన్ని పెంచుకుంటాడు మరియు సంతోషంగా ఉండే అవకాశాన్ని కోల్పోతాడు. మరోవైపు, ఒకరి పరిమితి నుండి బయటపడాలని కోరుకునే వ్యక్తి మరియు అతనిలో తన అభ్యాసాన్ని విస్తృతం చేయడానికి కృషి చేస్తాడు.

మనిషి కొత్త విషయాలు తెలుసుకునేందుకు, నేర్చుకొనేందుకే పుడతాడంటారు. గడిచే ప్రతి క్షణం జ్ఞానాన్ని బోధిస్తూనే ఉంటుంది. పుడమి తల్లి, కన్న తల్లికన్నా గొప్పదని శాస్త్రాలు చెబుతాయి. అరిషడ్వర్గాలు ప్రమాదకరమైనవని, సద్గుణాలు ఆనందాన్నిస్తాయని సాధనతో తెలుసుకుంటాం. అందరూ అన్నింటా మేటి అనిపించుకోవడం సాధ్యం కాదు. అయితే మనిషి పుట్టింది మొదలు కాలం చేసే దాకా కొత్త సంగతులు తెలుసుకుంటూనే ఉంటాడు. అలా జ్ఞానాన్ని సంపాదించడం మానవ ధర్మం. మరణించేలోగా అందాల్సిన జ్ఞానం అందకపోతే బతుకు నిష్ఫలమవుతుంది. వివేకులు జ్ఞాన సముపార్జనకు సదా సంసిద్ధులై ఉంటారు. పుణ్య క్షేత్రాలు, పర్యటక ప్రదేశాల్లో కొత్తగా జ్ఞానార్జన జరుగుతూ ఉంటుంది. విస్తృత పర్యటన వల్ల జీవితంపై కొత్త అవగాహన కలుగుతుంది. తమ పిల్లల నుంచి సైతం తల్లులు జ్ఞానార్జన చేసిన ఉదంతాలు మన సాహిత్యంలో కనిపిస్తాయి. కపిల మహర్షి తన తల్లి అయిన దేవహూతికి, ఆదిశంకరులు తమ మాతృదేవి ఆర్యాంబకు, రమణ మహర్షి తన మాతృమూర్తి అలఘమ్మాళ్‌కు ఆధ్యాత్మిక విద్య బోధించిన ఉదంతాలు లోక విదితం.

దుష్టుల నుంచి వారి తమోగుణం పనికి రానిదని, సత్పురుషుల నుంచి వారి సత్వగుణం అనుసరణీయమనీ నేర్చుకుంటాం. ప్రకృతిలో పంచ భూతాలు మనిషి ఆనంద విషాదాలకు కారణం. పంచభూతాలు అనుకూలమైతే ఆనందం, ప్రతికూలమైతే దుఃఖం కలుగుతుంది. తానే ప్రపంచమనే అనుభూతి మిగిలి ఉన్నంత వరకు మనిషికి సుఖదుఃఖాలు తప్పవు అన్నారు కావ్యకంఠ గణపతి ముని. అజ్ఞానంతో మనిషి కామ క్రోధాది అరిషడ్వార్గాలను పోషించినంతగా ఆత్మీయులను ప్రేమించడు. కోపం కలిగినపుడు మనిషి ప్రవర్తన ఎంత వింతగా ఉంటుందంటే అతడు కోపాన్ని ప్రేమిస్తున్నాడా అనిపిస్తుంది. కోపం నుంచి విముక్తి పొంది ఎంత త్వరగా విచక్షణ మేల్కొందా అన్నది మనిషి సాధనపై ఆధారపడి ఉంటుంది. కోపిష్టి మనషులకు శాంతి లభించదు. కామమనే జిలుగు పొర కమ్మిన మూర్ఖుడికి ఆనందం దుర్లభమే. సీతమ్మ వారిని చెరపట్టడం రావణుడంత భక్తుడు, విద్యావంతుడు, మహా బలవంతుడు చేయాల్సిన పని కాదు. చెడుకాలం దాపురించిన వాడికి అరుంధతి నక్షత్రం కనబడదని, మిత్రవాక్యం వినపడదని, కొడిగట్టిన దీపపు వాసన ఆకళింపునకు రాదనీ కవి వాక్యం.

దేహ సౌందర్యం, సంపద, విద్య వల్ల మనిషిని అహంకారం ఆవహిస్తుంది. అందం కాలక్రమంలో నశించేది కాగా సంపద నిలకడ లేనిది. ఇక విద్యకు వినయమే అలంకారం. వడ్డించిన విస్తరి ఒదిగి ఉన్నట్లు, నిండు కుండ తొణకనట్లు- సంపద, విద్య, అందం ప్రాప్తించిన వ్యక్తులు అణకువ ప్రదర్శిస్తే రాజపూజ్యత వరిస్తుంది. అహంకరిస్తే తమ దోషాలే తమను కబళిస్తాయని, అవమానాల పాల్జేస్తాయని మనిషి గ్రహించాలి. వినయ గుణం వల్ల గౌరవాదరాలు లభిస్తాయి. అహంకరిస్తే జరిగేది నష్టమే గానీ ఒరిగేదేం ఉండదు. పుస్తకాల్లో నేర్చుకునేది విద్య. లౌకిక విద్యలు ఎన్ని నేర్చినా వినయ గుణం లోపిస్తే- దాని వల్ల సంప్రాప్తించే దుష్ఫలితాల నుంచి సాధకుడు తప్పించుకోలేడు. విద్యతో పాటు అబ్బిన వినయం సాధకుడి బతుకును శోభాయమానం చేస్తుంది.

జీవితం యొక్క అంతిమ లక్ష్యం అయిన సుఖంలో విద్య ముగుస్తుంది. కానీ మొదటి షరతు వినయ లేదా ఇంద్రియజయ, ఇంద్రియాలపై పట్టు. వినయం కూడా వినయమే. నిజమైన వినయం అనేది అన్ని అహంభావాల నుండి విముక్తి పొందే స్థితి. ఒకే ఒక్క పాలకుడిగా భగవంతుని గురించి నిరంతరం అవగాహన కలిగి ఉండి, తన ఆజ్ఞను అమలుచేసే నిష్కపటమైన విధేయుడైన సేవకునిగా ఉండే స్థితిలో ఉండటం. ఇంద్రియాలపై పట్టు సాధించడమే యోగ్యత లేదా పాత్రతను తెస్తుంది. ఎంత నైపుణ్యం ఉన్న వ్యక్తి అయినా, ఇంద్రియాలపై నియంత్రణ లేకపోతే, అతను నిజంగా సమర్థుడు కాదు. ఒక వ్యక్తి నిజమైన యోగ్యతను కలిగి ఉన్నప్పుడు, అతను అన్ని ఆత్మ విలువలను కలిగి ఉంటాడు మరియు అన్ని వనరులతో సుసంపన్నం అవుతాడు. ఇది చేతన అభ్యాసానికి నిజమైన ప్రతిఫలం లేదా ధనం. ఈ విలువలు స్థిరత్వాన్ని లేదా స్థిరత్వాన్ని తీసుకువస్తాయి - ధర్మం. స్థిరమైన స్థితిలో, ఒకరు లోపల బాగా స్థిరపడినప్పుడు, ఒకరు ఆనందాన్ని అనుభవిస్తారు. ఇది విద్య నుండి సుఖం వరకు ప్రయాణం.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

(1) టెండరు నెం. SANDT_TELECOM-ZONAL-RGDA

పని పేరు: వాల్తేరు డివిజన్ యొక్క సీనియర్ సెక్షన్ ఇంజనీరు/టెలి/రాయగడ వారి పరిధిలో టెలికాం జోనల్ పని నిర్వర్తించుట.

ప్రకటిత విలువ: ₹31,24,113/-, బయానా: ₹62,500/-, పని పూర్తి చేయు కాలం: 12 నెలలు.

(2) టెండరు నెం. SANDT_TELECOM-ZONAL-VZM

పని పేరు: వాల్తేరు డివిజన్ యొక్క సీనియర్ సెక్షన్ ఇంజనీరు/టెలి/విజయనగరం వారి పరిధిలో టెలికాం జోనల్ పని నిర్వర్తించుట.

ప్రకటిత విలువ: ₹36,11,713/-, బయానా: ₹72,200/-, పని పూర్తి చేయు కాలం: 12 నెలలు.

బిడ్డింగ్ ప్రారంభ తేదీ: 28.08.2024 (రెండు టెండర్లకు), టెండరు ముగింపు తేదీ & సమయం: 11.09.2024న 1500 గంటలు (రెండు టెండర్లకు).

ఈ టెండరునకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించరు మరియు ఎవైన అట్టి మాన్యువల్ ఆఫర్ అందినచో తిరస్కరిస్తారు.

పై ఇ-టెండర్లు యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్ www.ireps.gov.in.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీరు, వాల్తేరు

PR-457/P/24-25

ఓటమిని వైసీపీ ఇంకా జీర్ణించుకోలేకపోతోంది

ఏపీ బీజేపీ చీఫ్, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి నివాసంలో నేడు బీజేపీ నేతల కీలక సమావేశం జరిగింది. రాష్ట్రంలో బీజేపీని ఎలా బలోపేతం చేయాలన్న అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, ఇటీవలి ఎన్నికల్లో ఓటమిని వైసీపీ ఇంకా జీర్ణించుకోలేకపోతోందని అన్నారు. వైసీపీ అరాచక పాలన వల్లే కూటమికి ఓట్లు వేశారని తెలిపారు.

## సీనియర్ జర్నలిస్టు కేవీ శర్మకు సన్మానం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జన్మాష్టమి పురస్కరించుకుని శ్రీ స్వామి వివేకానంద అనాథ ఆశ్రమం ద్వారా కేవీ శర్మకు సన్మానంచేసారు. జన్మాష్టమి సందర్భంగా నగరంలోని ఫారెస్ట్ టౌన్ ప్రాంతంలో ఉన్న శ్రీ స్వామి వివేకానంద అనాథ ఆశ్రమంలో సీనియర్ జర్నలిస్టు, విశాఖ సమాచార్ దినపత్రిక, హిందీ మాస పత్రిక సంపాదకీయ సలహాదారు కెవి శర్మకి లడ్డూ గోపాల్ ఫోటో, శాలువతో సంస్థ అధ్యక్షుడు సూరదా అప్పారావు సన్మాం చేసారు..

## శ్రీ కళ్యాణ సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్న భరత్ కుమార్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): వైఎస్సార్సీపి అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అనకాపల్లి పట్టణంలోని దిబ్బ వీధి శ్రీ నాగేంద్ర స్వామి సమేత శ్రీ కళ్యాణ సుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పూజలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ భరత్ కుమార్ కు సాదర స్వాగతం పలికింది. ఆలయం తరుపున దొడ్డి వెంకట సత్యనారాయణ (బాబు) భరత్ కుమార్ ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ రోషన్ కుమార్, ఆలయ సలహాదారు ఎల్లపు సత్యనారాయణ, వైసిపి నాయకులు కొణతాల మురళీకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, బొడ్డేడ శివ, కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్: ది రింగ్స్ ఆఫ్ పవర్ సీజన్ 2 విడుదలకు ముందు, సింగపూర్ లో ప్రైమ్ వీడియో ఒక అద్భుతమైన ఆసియా పసిఫిక్ ప్రీమియర్ ను అందిస్తోంది




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్: ది రింగ్స్ ఆఫ్ పవర్ ఎంతగానో ఎదురుచూడబడుతున్న రెండవ సీజన్ యొక్క ప్రపంచవ్యాప్తంగా ప్రీమియర్ గా ప్రసారం కాబోతున్న తరుణములో ఈ సీరీస్ లోని నటీనటులు మరియు నిర్మాణకర్తలు ఒక ప్రత్యేక ఆసియా పసిఫిక్ స్క్రీనింగ్ కొరకు సింగపూర్ వెళ్ళారు. తారాగణము అందరితో నిండిన ఈ ప్రీమియర్ లో షో రన్నర్ జే.డి.పేన్, దర్శకుడు షార్లెట్ బ్రాండ్ స్ట్రామ్ మరియు చార్లీ వికర్స్, లాయడ్ ఓవెన్, మెగాన్ రిచర్డ్స్, మార్కెల్లా కావెనాఘ్, చార్ల్స్ ఎడ్వర్డ్స్, ఇస్మేల్ క్రుజ్ కార్డోవ, టైరో ముహాఫిదిన్, మరియు ట్రైస్టాన్ గ్రావెల్లెలతో సహా ప్రతిభ కలిగిన నటీనటులు అంతా హాజరు అయ్యారు. వారి యాత్ర సమయములో, ఈ బృందము సీరీస్ యొక్క మొదటి రెండు ఎపిసోడ్స్ యొక్క ఒక ప్రత్యేక స్క్రీనింగ్ కు హాజరు అయ్యింది. ఇందులో జపాన్, థాయ్‌ల్యాండ్, ఇండోనేషియా, సింగపూర్, ఫిలిప్పైన్స్ మరియు ఇండియా నుండి మీడియాతో పాటు ఫ్రాంచైస్ యొక్క ఫాన్స్ కూడా పాల్గొన్నారు.

# ఏనుగుల సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించాలి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి దాదాపు గత ఎనిమిదేళ్లగా జిల్లాను వేధిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు కోరారు. మంగళవారం ఆయన పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ 2017లో పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రవేశించిన ఏనుగులు ఇప్పటివరకు 12 మందిని పొట్టను పెట్టుకోవడం బాధాకరమన్నారు. అలాగే మన జాతి సంపదైన ఏడు ఏనుగులు మృతి చెందటం మరింత బాధాకరమన్నారు. ఇటువైపు ప్రజలు, మరోవైపు ఏనుగులు మృత్యువాత పడుతున్నప్పటికీ పాలకులు, అధికారుల్లో కనీస స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. మానవ హక్కులు, వన్య ప్రాణ సంరక్షణ చట్టాలు ఎక్కడ అమలవుతున్నాయో వారే చెప్పాలన్నారు. ప్రభుత్వాలు తలుచుకుంటే ఈ ఏనుగులు సమస్య పరిష్కారం పెద్ద సమస్యేమీ కాదన్నారు. పాలకుల చేతగానితనం, అధికారుల అలసత్వం ఇటు ప్రజలు, ఏనుగులు మృత్యువాత పడుతూ ఉండటం బాధాకరమన్నారు. జిల్లాలో ప్రవేశించిన ఏనుగులు గుంపు ఈ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని, అవి స్వంతం చేసుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఇటు ప్రజల ప్రాణాలను తీస్తూ, అవి ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 12 మంది ప్రజల ప్రాణాలను బలి తీసుకోగా, ఏనుగులు కూడా ఏడు మృతి చెందాయన్నారు. పాలకులకు, అధికారులకు ఇటు ప్రజల ప్రాణాలు, అటు ఏనుగుల ప్రాణాల విలువ తెలియకపోవడం హాస్యాస్పదమన్నారు. ఇంత జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పరిస్థితి నెలకొంటుందన్నారు. గత ప్రభుత్వం, ఆ ప్రభుత్వంలో ఉన్నత పదవులు అనుభవించిన జిల్లాకు చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగులు సమస్య పరిష్కరించకపోవడం ప్రజలు దౌర్భాగ్యం అన్నారు. జిల్లా అవిర్భావానికి తొలి కొత్త కలెక్టర్ గా వచ్చిన అప్పటి కలెక్టర్ కూడా కనీస చర్యలు చేపట్టలేదు అన్నారు. ఇప్పటి ఉమ్మడి ప్రభుత్వ పాలకులైన మంత్రి, ఎమ్మెల్యేలతో పాటు ఇప్పటి జిల్లా కలెక్టర్ ఏనుగుల సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ ప్రాంతాన్ని సొంతం చేసుకున్న ఏనుగులను ఇక్కడి నుంచి తరలించడం దాదాపు అసాధ్యమే అన్నారు. కాబట్టి ఇక్కడ గతంలో గుర్తించిన కొన్ని ప్రాంతాలలో ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఏనుగులకు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు . ఆ కేంద్రాన్ని భవిష్యత్తులో పర్యాటక కేంద్రంగా మలచి ఆర్థికంగా కూడా ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు అన్నారు. ప్రభుత్వం తలుచుకుంటే ఏనుగుల సమస్య పెద్ద సమస్య కాదన్నారు. కానీ పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదని ఆరోపించారు. ఏనుగులు జిల్లాలో పర్యటించే ప్రాంతాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను సంబంధిత శాఖ అధికారులు తీసుకోకపోవడంతో ఏనుగులు మృత్యువాత పడ్డాయన్నారు. వణ్య ప్రాణ సంరక్షణ చట్టాన్ని తుంగలో తొక్కిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తృణప్రాయంగా ప్రజల ప్రాణాలు పోతున్న తరుణంలో వాటికి సంబంధించిన శాఖాధికారులు బదులిచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. 2017లో జిల్లాకు వచ్చిన ఎనిమిది ఏనుగులలో మూడు ఏనుగులు మృత్యువాత పడగా హరి అనే ఏనుగు కనిపించకుండా పోయిందన్నారు. ఈ కాలంలో ఏనుగులు గుంపు మరో నాలుగు సంతతిని వృద్ధి చేసుకున్నాయన్నారు. ఇప్పుడు ఇటువైపు 8 ఏనుగుల గుంపు పర్యటిస్తోందన్నారు . అలాగే సీతంపేట ప్రాంతానికి వచ్చిన 7 ఏనుగులు గుంపులో మూడు ఏనుగులు మృత్యువాత పడగా 4 ఏనుగులు ఆ ప్రాంతంలో పర్యటిస్తున్నాయన్నారు. ఇక్కడ ఉన్న ఎనిమిది అక్కడ ఉన్న నాలుగు ఏనుగులకు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, సకల సదుపాయాలు కల్పించి వాటి ప్రాణాలను రక్షించాలని కోరారు. అలాగే ఇప్పటివరకు జరిగిన ఆస్తి నష్టాన్ని తక్షణమే బాధితులకు అందజేయాలన్నారు. భవిష్యత్తులో ఇటు ప్రజల ప్రాణాలు కాని, ఏనుగులు ప్రాణాలు కాని పోకుండా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఏనుగుల దాడిలో సిబ్బంది కూడా మృత్యువాత పడటం బాధాకరమన్నారు.

## ఫార్మా కంపెనీలలో జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఫార్మా కంపెనీలలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కే లోకనాథం జిల్లా కలెక్టర్కు లేఖ రాశారు. లేఖ సారాంశాన్ని విలేకరులకు మంగళవారం విడుదల చేశారు.అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని ఎషన్షియ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదం రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్దది. 17 మంది మరణించడం, 36 మంది క్షతగాత్రులుగా వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. మీరు కూడా పర్యటించి బాధితులను పరామర్శించి, ప్రమాదం జరిగిన కంపెనీలో కూడా పరిశీలించారు.ఈ ప్రమాదం జరిగిన 24 గంటల లోపే పరవాడ ఫార్మాసిటీలోని సినర్జిన్ ఫార్మా కంపెనీలో మరో ప్రమాదం జరిగింది. పొల్యూషన్ డిపార్టుమెంట్, ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్లు, ఫైర్ డిపార్టుమెంట్ల స్పందనే కరువయ్యింది. ఉమ్మడి విశాఖలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి.

అనకాపల్లి జిల్లాలో పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి మండలాల్లో ఫార్మా పరిశ్రమలు స్పెషల్ ఎకనామిక్ జోన్స్‌లో ఇతర పరిశ్రమలు వున్నాయి. ప్రమాదకరమైన 138 ఫార్మా పరిశ్రమలు వున్నాయి. వీటిలో 40వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఎస్ఇజెడ్‌లలో మరో 20 వేల మంది కార్మికులు వున్నారు. పరిశ్రమల్లో ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు సేఫ్టీ ఆడిట్ రెగ్యులర్‌గా నిర్వహించకపోవడం వలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్మికులు, ఉద్యోగులు పదుల సంఖ్యలో మరణిస్తున్నారు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ ప్రాథమిక విచారణలో ఎసెన్షియా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని నిర్ధారణ చేశారు. కంపెనీల్లో నిరంతరం సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని కోరుతున్నాం. కంపెనీ యాజమాన్యంపై 106 (1), 125(బి), 125(ఎ) బిఎన్ఎస్ వంటి పోలీసు కేసుల పెట్టారు. యజమాన్యం స్టేషన్ బెయిల్ తీసుకొనే సెక్షన్లు పెట్టారు. ఇది సరైనదికాదని భావిస్తున్నాం.గత 5 ఏళ్లలో రాష్ట్రంలో సుమారు 119కు పైగా ప్రమాదాలు జరిగి, సుమారు 150 మంది మరణించినట్లు, వందలాది మంది క్షతగాత్రులయినట్లు నిన్న మీరే స్వయంగా ప్రకటించారు. ప్రమాదాల బారిన పడినవారు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బ్రాండిక్స్ లాంటి పరిశ్రమలో విషవాయువులు లీకైన ఘటనలో 500 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జోక్యం చేసుకుని ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయల పరిహారం ఇవ్వాలని ఆదేశిస్తే యాజమాన్యం ఆప్పీలుకు వెళ్లి కార్మికులకు నష్టపరిహారం ఇవ్వకుండా ఎగ్గొట్టింది.మీ ప్రభుత్వం వచ్చిన గత 80 రోజుల్లో అనకాపల్లి జిల్లాలోనే 4 ప్రమాదాలు జరిగాయి. భారీగా ప్రాణనష్టం జరిగింది. రాష్ట్రంలోనే అనేక ప్రైవేటు పరిశ్రమల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. కార్మికుల ప్రాణాలకు కనీసం విలువ లేకుండా పోయింది. సేఫ్టీ ఆడిట్ రెగ్యులర్‌గా నిర్వహించాలి. జి.వో.నెం. 62 తేది.28-3-2019ని విరమించాలి. ఈ జివో ద్వారా తనిఖీలు లేకుండా ఎస్ఇజెడ్‌లు పూర్తిగా మినహాయించబడ్డాయి. స్వయంగా భద్రత పాటిస్తున్నట్లు యజమానులు హామీ ఇస్తే తనిఖీలు అక్కరలేదనే క్లాజు కూడా పూర్తిగా ఎత్తివేయాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం తనిఖీలు లేకపోవడమే ఈ ప్రమాదాలక మూలకారణం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను విరమించుకోవాలని కోరుతున్నాం.

60వేల మంది కార్మికులు పనిచేస్తున్న అచ్యుతాపురం, పరవాడ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి లేక ప్రమాదం జరిగిన సమయంలో క్షతగాత్రులను విశాఖపట్నం, అనకాపల్లి ల్లోని ఆసుపత్రులకు తరలించేలోపే కార్మికులు మరణిస్తున్నారు. కార్మికులు, యాజమాన్యాల నుండి ఇఎస్ఐకి కోట్లాది రూపాయాల నిధులు జమ అవుతున్నాయి. కాని ఇఎస్ఐ ఆసుపత్రి ఈ ప్రాంతంలో లేదు. కావున అచ్యుతాపురం కేంద్రంగా 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, బర్న్ వార్డుతో ఏర్పాటు చేయాలి. అత్యవసర పరిస్థితులకు ఎన్‌డిఆర్ఎఫ్ కేంద్రాన్ని, అగ్నిమాపక వాహనాలను అదనంగా ఏర్పాటు చేయాలి. గతంలో జరిగిన ప్రమాదాలపై వివిధ కమిటీలు ఇచ్చిన నివేదికలను బట్టబయలు చేసి దీనిలోని లోపాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.పారిశ్రామిక ప్రమాదాల నివారనకు నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీ వేయాలని, అలాగే ఈ కమిటీలో నిపుణులతో పాటు కార్మిక సంఘాల నాయకులకు కూడా స్థానం కల్పించాలి సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరతున్నాము.

రాష్ట్ర వ్యాపితంగా ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు నిర్ణీత సమయాల్లో పరిశ్రమలను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలి.

పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలకు యాజమాన్యాలు భాధ్యులుగా చేసి క్రిమినల్ కేసులు పెట్టాలి.

అచ్యుతాపురం తదితర సెజ్‌లలో వంద పడకల ఆసుపత్రులను ఈఎస్ఐ వారి ద్వారా నిర్మింపచేసి, వారే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

రాష్ట్రంలో ఇతర ప్రాంతాల నుండి వచ్చే వలస కార్మికులందర్ని రిజిస్టర్ చేసి వారి వివరాలన్నీ ఎంఆర్ఓలు సంక్షిప్తం చేయాలి.కార్మిక శాఖ అధికారులు పని గంటల అమలుపై అన్ని పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించాలి.

ప్రమాదకరమైన పరిస్థితులున్న అన్ని పరిశ్రమల్లో పర్మినెంట్ కార్మికులను మాత్రమే నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.ఎసెన్షియా కంపెనీ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం వేసే కమిటీలో కార్మిక ప్రతినిధి కూడా చేర్చాలి. అప్పుడే వాస్తవాలు వెలికివస్తాయి.ప్రతి ఆరు నెలలకొకసారి ఫార్మా కంపెనీల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి.హెల్మెట్, షూష్, ఫైర్ కోట్స్, ఫేస్‌షీల్డ్, హార్డ్ టోపీలు, గ్లౌజులు, ఇయర్ ప్లగ్‌లు, రెస్పిరేటర్లు, ఫాల్ ప్రొటక్షన్ ఎక్విమెంట్ తదితర భద్రతా పరికరాలు ఇవ్వాలి.మృతుల కుంటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలి. వారి పిల్లలకు ఉచితంగా విద్యను అందించాలి.ఎసెన్షియా పరిశ్రమ నిర్మాణ డిజైన్ వల్ల ప్రమాదం జరిగిందని నిపుణులు తెలియజేస్తున్నారు. మిగిలిన పరిశ్రమల యొక్క డిజైన్స్‌ను కూడా పరిశీలించి లోపాలను సరిచేయాలని కోరుతున్నాం అని లోకనాథం అన్నారు.

# నూనెలతో పేలకు స్వస్తి

చాలా మంది తలలో పేల సమస్యతో బాధపడుతుంటారు. ముఖ్యంగా పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. అలాంటప్పుడు ఏ టిప్స్ పాటిస్తే సమస్య దూరమవుతుందో, ఎలాంటి చిట్కాలు అనుసరించాలో తెలుసుకుందాం. తల్లో పేను చూడ్డానికి, వినడానికి చిన్న సమస్యే అయినా చాలా ఇబ్బందిగా ఉంటుంది. ముఖ్యంగా పిల్లలు స్కూల్లోకి వెళ్ళినప్పుడు, బయట ఆడుకుంటున్నప్పుడు ఒకరి నుంచి ఒకరికి ఇవి త్వరగా వెళ్తాయి. దీంతో ఎప్పుడూ వారు చేతులు తలలోకే వెళ్తాయి.

తలలో ఉండే ఈ పేలు తలోని రక్తాన్ని పీలుస్తుంటాయి. ఇవి గుడ్లు పెట్టి పెరుగుతుంటాయి. దీంతో అవి తలలో ఉన్నంతసేపు దురదగానే ఉంటుంది. ఇవి ఎలాంటి హాని చేయకపోయినప్పటికీ ఎక్కువగా ఉండడం వల్ల దురదగా ఉంటుంది. అయితే, కొన్ని ఇంటి చిట్కాలతో సమస్యని దూరం చేసుకోవచ్చు. అవేంటో తెలుసుకోండి.



**పిప్పరమింట్ ఆయిల్:** ఇందులోని గొప్ప గుణాలు పేలని దూరం చేయడంలో సాయపడుతుంది. ఇందుకోసం కొద్దిగా ఆలివ్ ఆయిల్ తీసుకుని అందులో పిప్పరమెంట్ ఆయిల్ మిక్స్ చేసి తలకి రాయండి. బాగా మసాజ్ చేయండి. వెడల్పాటి దువ్వెనతో దూయాలి. అరగంట తర్వాత తలస్నానం చేయాలి.

**వెనిగర్:** వెనిగర్‌లో ఎసిటిక్ యాసిడ్ ఉంటుంది. ఇది కొద్దిగా నూనెలో కలిపి రాయడం వల్ల ఫలితం ఉంటుంది.

**ఆలివ్ ఆయిల్:** ఆలివ్ ఆయిల్ కూడా పేలని దూరం చేయడంలో బాగా పనిచేస్తుంది. దీనిని రాయడం వల్ల తలలోని పేలు చాలా వరకూ దూరమవుతాయి.

**మయోనైస్:** మయోనైస్ పేలని చంపుతుంది. పేను వల్ల కలిగే దురదని, చికాకుని దూరం చేస్తుంది. దీనిని కుదుళ్ళకి ప్యాక్‌లా రాయాలి. తర్వాత మైల్డ్ షాంపూతో తలస్నానం చేయాలి. అయితే, ప్లెయిన్ మయోనైస్ తీసుకోవాలి.

**కొబ్బరినూనె:** కొబ్బరినూనెలో పేనులో కొద్దిగా సోంపు ఆయిల్ కలిపి రాయాలి. ఈ ఆయిల్ చాలా ఎఫెక్టివ్‌గా పేలని దూరం చేస్తుంది.

**సోంపు ఆయిల్ :** సోంపు ఆయిల్ కూడా జుట్టు ఆరోగ్యానికి చాలా మంచిది. దీనిని రాయడం వల్ల తలలో ఉండే చుండ్రు, పేలు, చికాకు దూరమవుతుంది. రెగ్యులర్‌గా దీనిని అప్లై చేయడం మంచిది.

**వంటసోడా.బేకింగ్ సోడా** కూడా పేలను ఎఫెక్టివ్‌గా చంపుతుంది. బేకింగ్ సోడాలో కొద్దిగా నీరు కలిపి ప్యాక్‌లా వేయండి. అయితే, కళ్ళకి దూరంగా ఉండేలా చూసుకోండి.

దువ్వడం. అదే విధంగా చెక్క దువ్వెనల్ని 5 నుంచి 10 నిమిషాల పాటు వేడినీటిలో నానబెట్టి గట్టిగా దువ్వండి. దీని వల్ల పేలు చాలా వరకూ చనిపోతాయి.

అయితే, ఇప్పుడు చెప్పినవన్నీ కూడా మీకు సరిపోతాయో లేదో ప్యాచ్ టెస్ట్ చేసుకోండి. అదే విధంగా, తక్కువ పరిమాణంలో అప్లై చేయండి. దీంతో పాటు జుట్టుని రెగ్యులర్‌గా క్లీన్ చేయడం, తలస్నానం చేయడం, దువ్వడం వంటివి చేయాలి. దీని వల్ల చాలా వరకూ సమస్య తగ్గుతుంది.

# టేస్టీ టేస్టీ కేరళ స్పెషల్ అవియల్ చేసేద్దామా!



మనకి సంక్రాంతి ఎలానో కేరళీయులకి ఈ ఓణమ్ పండగ అలా. పదిరోజుల పాటు సాగే ఈ పండగరోజుల్లో సాద్య పేరుతో సంప్రదాయ వంటకాలని వండివారుస్తారు. ఈ సాద్యలో అవియల్ తప్పనిసరిగా చేసుకుంటారు. టేస్టీ టేస్టీ అవియల్ ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం.

**ఈ పదార్థాలు తీసుకోండి:** మునక్కాడలు : రెండు, బీన్స్ : పది, పచ్చి బఠాణీ : ఒక కప్పు, ఆకుపచ్చ క్యాప్సికం : ఒకటి, అరటి కాయ : ఒకటి, ఆలూ : రెండు, ముల్లంగి : ఒకటి, సొరకాయ : చిన్న ముక్క, గుమ్మడి కాయ : పావు ముక్క, క్యారట్ : నాలుగు, పచ్చి కొబ్బరి : ఒక కొబ్బరికాయ పూర్తిగా, పచ్చి మిరపకాయలు : ఐదు, జీలకర్ర : ఒక స్పూను, కొబ్బరి నూనె: ఆరు టీ స్పూన్లు, ఆవాలు : తాలింపుకి సరిపడా, కరివేపాకు : తాలింపుకి సరిపడా, పసుపు : చిటికెడు, ఎండు మిరపకాయలు : రెండు, ఇంగువ : చిటికెడు, పెరుగు : మూడు టేబుల్ స్పూన్లు.

**తయారీ విధానం:**

మునక్కాడలు, బీన్స్, క్యాప్సికం, గుమ్మడి కాయ, క్యారట్, ఆలూ, ముల్లంగి, సొరకాయ పొడుగు ముక్కలుగా కట్ చేసుకుని ఒక పాత్ర లోకి తీసుకోవాలి, వీటిలో బఠాణీలు వేసుకోవాలి. ఈ ముక్కల్లో పసుపు వేసి ఒక పాత్రలో ఉంచాలి. ఇప్పుడు ఈ కూరగాయలలో నీళ్ళు పోసి ఉడికించుకోవాలి. ఇవిఉడికే లోగా పచ్చి కొబ్బరి, పచ్చి మిరప కాయలు, జీలకర్ర బరకగా మిక్సీ పట్టుకోవాలి. విడివిడిగా ఉడికించుకున్న కూరగాయ ముక్కలలో ఈ మిశ్రమాన్ని కలుపుకోవాలి. దీనిలో ఒక టేబుల్ స్పూన్ పెరుగు వేసి కలపాలి. చివరగా కొబ్బరి నూనె వేడి చేసి అందులో ఆవాలు, కరివేపాకు, ఎండు మిరపకాయలు, కొద్దిగా ఇంగువ వేసి తాలింపు వేసుకోవాలి. అంతే... నోరూరించే అవియల్ రెడీ. దీనిని అన్నంతో, చపాతీలతో తింటే చాలా బాగుంటుంది.

# శనగలు తింటే బరువు తగ్గుతారా ? పెరుగుతారా ?



నూటికి 80 శాతం మంది సమస్య అధిక బరువు. బరువు పెరగడం ఈజీ కానీ తగ్గడం చాలా కష్టం. పెరిగిన బరువును తగ్గించుకునేందుకు చాలామంది ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. రకరకాల డైట్‌లు, వ్యాయామాలు చేస్తుంటారు. ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. డైట్‌లో కొవ్వును పెంచేవాటిని పక్కనపెట్టి ప్రొటీన్, ఫైబర్ శాతాలు ఎక్కువగాఉండే ఆహారాలను తీసుకుంటున్నారు. మరి డైట్‌లో శనగలు తినొచ్చా? శనగలు బరువును తగ్గిస్తాయా? పెంచుతాయా? అనే అనుమానాలు మీకూ ఉన్నాయా? అయితే ఈ విషయాలు తెలుసుకోండి.

**జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది:** బరువు తగ్గాలనుకునేవారు శనగలను తినవచ్చు. వీటిని నానబెట్టి, ఉడకబెట్టి, మొలకెత్తినవి తినవచ్చు. శనగలలో ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి బరువుని తగ్గించేందుకు సహకరిస్తాయి. ఫైబర్ జీర్ణశక్తిని మెరుగ్గా ఉంచుతుంది. శనగలు తింటే కడుపు నిండిన భావన కలిగి త్వరగా ఆకలివేయదు.

**హెల్దీ స్నాక్: (ఆరోగ్యక రమైన చిరుతిండి) :** డైట్‌లో శనగలను తినని వారి కంటే తిన్నవారే త్వరగా బరువు తగ్గినట్లు కొన్ని అధ్యయనాల్లో తేలింది. అరకప్పు శనగలలో 6 గ్రాముల ఫైబర్, 7 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. అందుకే దీనిని హెల్దీ స్నాక్‌గా చెబుతారు.

**నిద్రలేమి సమస్య ఉండదు:** నిద్రలేమి సమస్య ఉన్న వారు రెగ్యులర్‌గా శనగలను తింటే ఆ సమస్య నుంచి బయటపడవచ్చు.

**గుండె సమస్యలు తగ్గుతాయి:** శనగలలో ఉండే ఆల్ఫాలినోలెనిక్ యాసిడ్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, కొలెస్ట్రాల్ లెవెల్స్‌ని తగ్గిస్తాయి. అలాగే గుండె సంబంధిత సమస్యలు తగ్గుతాయి. వీటిలో ఉండే ఎమినో యాసిడ్స్, ట్రిప్టోఫాన్, సెరోటొనిన్ వంటి విటమిన్స్ మంచి నిద్రను అందిస్తాయి.

**కాల్షియం మెండుగా:** కాల్షియం అనగానే ఠక్కున గుర్తొచ్చేవి పాలే కదా. కానీ శనగలలో కూడా పాలకు సమానమైన కాల్షియం ఉంటుంది. 100 గ్రాముల శనగలలో 164 మి.గ్రా కెలరీలు, 8.9 గ్రాముల ప్రొటీన్, 2.5 గ్రాముల ఫ్యాట్, 8.6 గ్రాముల ఫైబర్, 2.8 గ్రాముల ఐరన్ ఉంటాయి.

**పీచు పదార్థాలు:** శనగలు, కాబూలీ శనగల్లో కొవ్వులు తక్కువగా పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. శాకాహారులు ప్రతిరోజూ శనగలు తింటే నాన్ వెజిటేరియన్స్ పొందే అన్నిరకాల పోషకాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. మీ డైట్‌లో శనగలను ఎలాంటి అనుమానాలు లేకుండా తినవచ్చని సూచిస్తున్నారు.

# వృద్ధులూ! పడిపోకుండా... కొన్ని జాగ్రత్తలు!



మహిళలు ప్రతి వయస్సులో తమను తాము జాగ్రత్తగా చూసుకోవాలి. వృద్ధాప్యంతోపాటు స్త్రీల శరీరంలో అనేక రకాల సమస్యలు వస్తుంటాయి. 40 ఏళ్ల తర్వాత మహిళల్లో ఎముకల నొప్పి ఎక్కువగా ఉంటుంది. స్త్రీల ఎముకలు మరింత దృఢంగా, తక్కువ మందంగా ఉండటం వల్ల స్త్రీలకు ఎముకల వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. మహిళల్లో ఆస్టియోపోరోసిస్ అనేది మెనోపాజ్ తర్వాత ఎక్కువగా కనిపించే సమస్య. వయస్సుతో, ఎముకలకు మద్దతు ఇచ్చే హార్మోన్లు తక్కువగా విడుదలవుతాయి.

మహిళల్లో వృద్ధాప్యంతో ఎముకలు బలహీన పడటాన్ని ఆస్టియోపోరోసిస్ అంటారు. ఈ స్థితిలో, ఎముక ద్రవ్యరాశి సాంద్రత తగ్గుతుంది, ఇది ఎముక పగుళ్ల ప్రమాదాన్ని పెంచుతుంది. మహిళలు పెద్దయ్యాక అడుగడుగునా జాగ్రత్తగా ఉండాలి. వారు ఎట్టి పరిస్థితుల్లోనూ పడిపోకూడదు. వారి ఎముకలకు గాయం వారిని తీవ్ర అనారోగ్యానికి గురి చేస్తుంది. వయసు పెరిగే కొద్దీ 'ఆస్టియోపెనియా' వచ్చే ప్రమాదం పెరుగుతుంది, దీని వల్ల ఎముకలు త్వరగా విరిగిపోతాయి.

మహిళలు ఏ వయసు వారైనా తమను తాము జాగ్రత్తగా చూసుకోవాలి. వాళ్ళు పడిపోకూడదు, జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా వృద్ధ మహిళలు జాగ్రత్తగా నడవాలి. ఒకసారి ఆమె పడిపోయి. ఆమె ఎముకలు గాయపడినట్లయితే, ఈ గాయం మరణానికి కూడా దారి తీస్తుంది. వృద్ధ మహిళలు పగుళ్లను నివారించడానికి, ప్రమాదవశాత్తు గాయాలను నివారించడానికి ఒక సమయంలో ఒక అడుగు వేస్తారు. మేము మీకు కొన్ని ప్రత్యేక చిట్కాలను చెబుతున్నాము, వీటిని మహిళలు పాటించినట్లయితే ప్రతిరోజూ జరిగే ప్రమాదాలను నివారించవచ్చు.

**మీరు ఎముకలు విరగకుండా కాపాడుకోవాలంటే**

వర్షపు రోజులలో బయటకు వెళ్లకుండా ప్రయత్నించండి. వర్షంలో జారిపోతానేమో నన్న భయం ఎక్కువైంది. స్నానం చేసేటప్పుడు లేదా టాయిలెట్‌కు వెళ్లేటప్పుడు జారిపడకుండా ప్రత్యేక శ్రద్ధ వహించండి.

బాత్‌రూమ్‌లో స్నానం చేసే సమయంలో మహిళలు ప్యాంటీలు ధరించకపోవడం చాలా ముఖ్యం.గోడ లేదా స్టాండ్ సపోర్టు తీసుకుని ప్యాంటీ వేసుకోవడానికి ప్రయత్నించడం చెడ్డ పద్ధతి. ఈ విధంగా ప్యాంటీలు ధరించడం వల్ల తుంటి ఎముక జారిపడి విరిగిపోయే ప్రమాదం ఉంది. స్నానం చేసిన తర్వాత, మీ దుస్తులు మార్చుకునే గదికి వెళ్లి, కుర్చీపై లేదా మీ మంచంపై కూర్చున్నప్పుడు మీ ప్యాంటీని ధరించండి.

టాయిలెట్‌కు వెళ్లేటప్పుడు, బాత్రూమ్ యొక్క ఫ్లోర్ పొడిగా ఉందని, జారిపోయే ప్రమాదం లేదని గుర్తించుకోండి. ముఖ్యంగా మహిళలు కమోడ్‌ను మాత్రమే ఉపయోగించాలి. కమోడ్ సీటు నుండి నేరుగా లేచేటప్పుడు, దానిని పట్టుకోవడానికి హ్యాండ్ రెస్ట్ కూడా పెట్టండి, దాని ద్వారా మహిళలు లేవండి. స్నానం చేసేటప్పుడు, స్నానం చేసేవారు బల్ల మీద కూర్చొని స్నానం చేస్తారని గుర్తుంచుకోండి, తద్వారా వారికి ఎలాంటి గాయాలు వచ్చే ప్రమాదం లేదు.

పడుకునే ముందు గది నేలను శుభ్రంగా, పొడిగా ఉంచండి. నేల తడిగా ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండండి. అర్ధరాత్రి నిద్ర లేచినప్పుడు, 3-4 నిమిషాలు మంచం మీద కూర్చోండి, ముందుగా లైట్ వేసి, ఆపై మంచం నుండి లేవాలని గుర్తుంచుకోండి.

టాయిలెట్‌కు వెళ్లేటప్పుడు, దాని తలుపును మూసివేయకూడదని గుర్తుంచుకోండి, ముఖ్యంగా రాత్రి సమయంలో, తలుపు తెరిచిన తర్వాత మాత్రమే టాయిలెట్‌కు వెళ్లండి. వీలైతే, టాయిలెట్‌లో అలారం బెల్‌ను అమర్చండి, తద్వారా ఏదైనా అత్యవసర పరిస్థితిలో, అలారం బటన్‌ను నొక్కడం ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వవచ్చు.

సీనియర్ సిటిజన్లు కుర్చీ లేదా మంచం మీద కూర్చోవాలి, ఆ తర్వాత మాత్రమే బట్టలు మార్చుకోవాలి. ఎముకలు దృఢంగా ఉండేలా వ్యాయామం చేయండి. కనీసం నడవండి.

స్త్రీలు తమ బరువును అదుపులో ఉంచుకుంటారు. మీ ఎత్తు, వయస్సు ప్రకారం బరువు ఉండాలో తెలుసుకుని, దానిని అనుసరించండి. అధిక బరువు ఎముకలపై ఒత్తిడి తెచ్చి ఎముకలను బలహీనం చేస్తుంది. అతిగా తినడం మానుకోండి. మీరు ఆకలితో ఉన్న దానికంటే తక్కువ తినకండి.

ఎముకలు దృఢంగా ఉండాలంటే ఇలాంటి ఆహారం తప్పనిసరి.

వృద్ధులు ముఖ్యంగా ఈ విధంగా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటారు:

గణాంకాల ప్రకారం, వృద్ధులు ఒకసారి పడిపోయి, ఎముకలపై గాయపడినట్లయితే, ఆ గాయం వారి మరణానికి దారి తీస్తుంది.

పతనం తప్పనిసరిగా పగుళ్లకు దారితీయదు, కానీ పతనం యొక్క కంపనం, శక్తి వృద్ధుల మొత్తం శరీరానికి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది.

వృద్ధులు బాత్రూంలో జాగ్రత్తగా నడుస్తారు. మెట్లు ఎక్కేటప్పుడు, రైలింగ్‌పై శ్రద్ధ వహించండి. పడిపోకండి. మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోండి.

ఒక స్త్రీ ఒక్కసారి పడిపోతే, ఆమె రాబోయే పదేళ్లు ముగియవచ్చని మీకు తెలుసా? పడిపోవడం వల్ల వారి ఎముకలు, కండరాలన్నీ నాశనం అవుతాయి.

# కొవ్వు కరిగించుకోడానికి బంగాళదుంప తొక్క



మనం వంటకు ఉపయోగించే కూరగాయల్లో కొన్నింటిని వాటిపై ఉన్న తొక్కను తీసేసి వాడుతుంటాం. వాటిలో బంగాళదుంప ఒకటి. బంగాళ దుంపలతో తయారు చేసే ఏ వంటకమైనా చాలా టేస్టీగా ఉంటుంది. ఆలూ ఫ్రై, ఆలూ మసాలా కర్రీ, ఆలూ-టమాటా కర్రీ ఇలా రకరకాలుగా వండుకుంటాం. బంగాళ దుంపను ఇష్టపడని వారు చాలా తక్కువగా ఉంటారు. దాదాపు అందరూ ఎంతో ఇష్టంగా తినే బంగాళదుంపలే కాదు వాటి తొక్కల్లోనూ ఔషధ గుణాలున్నాయి.

బంగాళదుంప తొక్కలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ బారిన పడకుండా సహాయపడుతాయి. వీటిలో ఉండే పొటాషియం రక్త పోటును అదుపులో ఉంచుతుంది. బంగాళదుంప తొక్కలు శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయ పడతాయి. మరి బంగాళాదుంపలను తొక్కతో సహా తినలేం కదా. తొక్కలో ఉండే పోషకాలు కూడా పొందాలంటే వాటినెలా పొందాలో తెలుసుకుందాం.

బంగాళ దుంపలను తొక్కతో సహా బాగా కడగాలి. బంగాళాదుంపల నుంచి తొక్కను వేరుచేసి ముక్కలుగా తరగాలి. ఈ ముక్కలను ఒక గ్లాస్ నీటిలో వేసి 10 నిమిషాల పాటు బాగా మరిగించాలి. ఈ నీటిని వడకట్టి గోరువెచ్చగా అయిన తర్వాత తాగాలి. ఇందులో రుచికోసం 1 టీ స్పూన్ తేనెను కూడా కలుపుకోవచ్చు. ఇలా బంగాళదుంప తొక్కలతో చేసిన నీటిని తాగడం వల్ల అధిక బరువు కూడా తగ్గొచ్చు.

వీటిలో ఉండే ఫైబర్ శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించడంలో ఉపయోగపడుతుంది. యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా సహాయపడుతాయి. తొక్కలను పేస్ట్ చేసి గాయాలపై లేపనంగా రాస్తే అవి త్వరగా మానిపోతా యి. బంగాళాదుంప తొక్కల్లో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఈ నీటిని తాగితే రక్తహీనత సమస్య కూడా తగ్గుతుంది.

బంగాళదుంప తొక్కల పేస్ట్‌ను ఒక గిన్నెలోకి తీసుకుని ఈ పేస్ట్ లో ముల్తానీ మట్టి లేదా, గంధం కలిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుంటే మృత కణాలు తొలగిపోతాయి. మొటిమలు, మచ్చలు, ముడతలు తగ్గి ముఖం నిగారింపు పెరుగుతుంది.

# మునగ ఆకుతో ఒక నెలలోనే ఒత్తైన జుట్టు మీ సొంతం

ప్రస్తుతం ఇప్పుడున్న బిజీ బిజీ రోజుల కారణంగా ఏదైనా వెంటనే అయిపోవాలి. కారణం సమయం లేకపోవడం. గంటల్లోనే, రోజుల్లోనే రిజల్ట్ కోసం ఎదురు చూస్తుంటారు. అయితే అలా తొందరగా అయ్యే వాటిల్లో పాజిటివ్ కంటే నెగిటివ్ ఎఫెక్టే ఎక్కువగా ఉంటుంది. ఈ బిజీ లైఫ్ కారణంగా ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా శరీరానికి రెస్ట్ ఇవ్వకుండా పనుల్లో నిమగ్నమైపోతున్నారు. అనంతరం జబ్బుల బారిన పడుతున్నారు. అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. దీంతో ఆస్పత్రుల వెంట తిరిగి తిరిగి మందు బిళ్లలను మింగుతున్నారు. కాస్త సమయాన్ని వెచ్చిస్తే ఇంట్లో ఉండే కొన్ని రకాల పద్ధతులతో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఏమీ ఉండవు.

ఇప్పుడు చాలా మంది జుట్టు సమస్యలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా జుట్టు అతిగా రాలుతూ ఉంటుంది. జుట్టు రాలడానికి అడ్డుకట్ట వేస్తే మిగిలిన సమస్యలు కూడా సర్దుకుంటాయి. ఆడవారికి ముఖ్యంగా జుట్టుతోనే మరింత అందం తోడవుతుంది. జుట్టుకు మేలు చేసే వాటిల్లో మునకాకు ఒకటి. మునగాకు నుంచి తయారు చేసిన ఆయిల్ జుట్టుకు చాలా మేలు చేస్తుందని పలు అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. మరి మునగాకును ఎలా వాడితే ప్రయోజనాలు ఉంటాయో ఇప్పుడు తెలుసుకుందాం.



**మునగ ఆకుతో హెయిర్ ప్యాక్:** ఈ హెయిర్ ప్యాక్ వేసుకోవడానికి రెండు చెంచాల మునగ ఆకు పౌడర్‌కి, రెండు టేబుల్ స్పూన్ల బాదం నూనె, 1 టేబుల్ స్పూన్ అలోవెరా జెల్‌ను కలపండి. దీన్ని జుట్టుకు బాగా పట్టించాలి. గంటసేపు తర్వాత షాంపూతో తలస్నానం చేయడం. ఇలా వారానికి ఒక్కసారైనా ఈ ప్యాక్ వేసుకుంటే జుట్టు రాలడం తగ్గిపోవడమే కాకుండా ఒత్తుగా నిగనిగలాడుతూ ఉంటుంది.

**మునగ ఆకు ఆయిల్:** బాదం నూనె లేదా కొబ్బరి నూనెను తీసుకోండి. దానితో 2 - 3 చుక్కల మునగ విత్తన నూనెను కలపండి. రెండింటిని బాగా కలిపి తలకు రాసుకోవాలి. ఆ తర్వాత ఓ ఐదు నుంచి 10 నిమిషాల పాటు మసాజ్ చేసుకోవాలి. ఇలా ఓ అరగంట సేపు ఉంచి షాంపూతో కడిగేసుకోవడమే.

మునగ ఆకులు జుట్టు పెరుగుదలకు సహాయపడతాయి. ఈ ఆకుల్లో ఉంటే విటమిన్ సి మీ తలకు చాలా మేలు చేస్తుంది. ఈ విటమిన్ కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది రక్త ప్రసరణను కూడా పెంచుతుంది. అలాగే జుట్టు మూలాలను బలపరుస్తుంది. ఇది ఒమేగా-త్రీ ఫ్యాటీ యాసిడ్‌లను కలిగి ఉంటుంది. అలాగే జుట్టుకు సహజంగా తేమను అందిస్తుంది. మునగ ఆకుల్లో అమైనో ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇది మీ జుట్టు కణాలను బలపరుస్తుంది. కాబట్టి జుట్టు రాలడం కూడా తగ్గుతుంది.

## ఎండి రాజ్ కి డా. బి. ఆర్. అంబేద్కర్ జాతీయ సేవా రత్న అవార్డు



విజయవాడ అమరావతి నడిబొడ్డున పౌర గ్రంథాలయంలో మదర్ సర్వీస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో రెండవ వార్షికోత్సవం సందర్భంగా వివిధ సాంస్కృతిక, సేవా కార్యక్రమంలు చేసిన వారిని గుర్తించి నాలుగైదు రాష్ట్రాలు వారికి అవార్డులు ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం ఈ. బోనంగి గ్రామానికి చెందిన ఎండి రాజ్ కి ప్రఖ్యాత డా. బి. ఆర్. అంబేద్కర్ జాతీయ సేవా రత్న అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఎండి రాజ్ మాట్లాడుతూ ఈ అవార్డు ఇచ్చిన మదర్ సర్వీస్ సొసైటీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తు, భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమంలు చేపడతానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హర్షిత డెవలపర్స్ జనరల్ మేనేజర్ సంపత్ కుమార్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ దాసు, మనం ఫౌండేషన్ ఫౌండర్ చక్రవర్తి, హెల్ప్ ఫౌండేషన్ (సత్తనపల్లి) వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, విజయవాడ సిటీ ఎమ్మెల్యేలు, సినీ ఆర్టిస్టులు, నేషనల్ ఎన్జీవో ప్రతినిధులు, టీవీ ఆర్టిస్టులు, రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు సింగర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పేదలకు చీరల పంపిణీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు రెండవ రోజు సందర్భంగా, దక్షిణ నియోజకవర్గం టి.డి.పి. ఇంచార్జ్ సీతం రాజు సుధాకర్ పేదలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీకృష్ణుని పూజలో పాల్గొని, కృష్ణుడు ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివేకానంద సంస్థ వారు వృద్ధాశ్రమం, నిత్య అన్నదానాలతో, పలు రకాలుగా సేవలందిస్తున్న సంస్థ వారిని అభినందిస్తూ, సంస్థ కు తమ సహాయం ఎప్పుడూ ఉంటాదని ఆయన తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి రెండవ రోజు సందర్భంగా పేదలకు , వృద్ధులకు చీరలు పంపిణీ చేసిన సుధాకర్ కి ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు అప్పారావు అభినందనలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి.నారాయణ, తెలుగుదేశం నాయకులు దానేష్, మైలిపిల్లి.శ్రీను, తెలుగుదేశం పార్టీ మరియు సంస్థ సభ్యులు ఉమాదేవి, రాణి పాల్గొన్నారు.

## రన్ ఆఫ్ కచ్ లో తన నైపుణ్యం నిరూపించిన ద ఇంటిలిజెంట్ సియువి, ఎంజి విండ్సర్




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జేస్ డబ్ల్యూ ఎంజి మోటార్ భారతదేశంలో రాబోతున్న వాహనం- ఎంజి విండ్సర్, భారతదేశపు మొదటి క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ గుజరాత్ లోని సమస్యాత్మకమైన భూభాగం రన్ ఆఫ్ కచ్ లో తన సాటిలేని సామర్థ్యాన్ని ప్రదర్శించింది. భారత దేశపు మొదటి సియువి-ఎంజి విండ్సర్ తన నైపుణ్యాన్ని నిరూపించింది మరియు ప్రపంచంలోనే అతి పెద్ద ఉప్పు ఎడారులలో ఒకటైన రన్ ఆఫ్ కచ్ లోని 44oCకి పైగా తీవ్రమైన వేడిలో తన ఇంజనీరింగ్ శ్రేష్టతను వెల్లడించింది.

కఠినమైన మరియు తీవ్రమైన పరిస్థితిలో తీవ్రమైన ఉష్ణోగ్రతల కింద ఎంజి విండ్సర్ తట్టుకునే సామర్థ్యాన్ని మరియు సాహసాన్ని తాజాగా విడుదలైన వీడియో తెలియచేస్తోంది. ఈ తీవ్రమైన పరిస్థితిలో ద ఇంటిలిజెంట్ ప్రయాణం తన దృఢమైన డిజైన్, ఆధునిక టెక్నాలజీ, మరియు సాటిలేని సామర్థ్యానికి నిరూపణ. కఠినమైన సవాళ్లను తట్టుకునే విధంగా రూపొందించబడిన ఈ పరీక్ష నేలను ఆక్రమించడమే కాకుండా, వాస్తవిక ప్రపంచ పరిస్థితులలో విండ్సర్ ఆధిపత్యం మరియు నైపుణ్యాన్ని కూడా సుస్థిరపరుస్తుంది.

ఈ వీడియో శ్రేణిలోనే మొదటి 'ఏరో-లాంజ సీట్స్ 'మరియు 'ఇన్ఫినిటి వ్యూ గ్లాస్ రూఫ్' ను ఇటీవల వెల్లడించిన వీడియోని అనుసరించి వచ్చింది. ఇది ఇప్పటికే శ్రేణిలో సౌకర్యం మరియు ప్రీమియత్వానికి కొత్త ప్రమాణంగా నిలిచింది. ఈ ఆధునిక ఫీచర్స్ యొక్క ఈ కలయిక ఆచరణీయత మరియు పనితీరులో రాజీ లేని ప్రీమియం డ్రైవింగ్ అనుభవాన్ని కోరుకునే భారతదేశపు వినియోగదారులకు ప్రధానమైన ఎంపికగా ఎంజి విండ్సర్ ను మార్చింది.

# సమిష్టి కృషితో ఆంధ్రలో సినీ పరిశ్రమ అభివృద్ధి

## ఏపీ ఫిల్మ్ ఫెడరేషన్ చైర్మన్ డా.కంచర్ల



**తాడేపల్లి గూడెం, (విశాఖ సమాచారమ్):** తెలుగు సినీపరిశ్రమలోని అందరి కృషితో ఫెడరేషన్ ను అభివృద్ధి చేయడంతోపాటు, కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఫెడరేషన్, ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ చైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లిగూడెంలో జరిగిన ఫెడరేషన్ సభ్యుల అభినందన సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో సినిమా పరిశ్రమను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి సినీ నిర్మాతగా, ప్రభుత్వంలోని మనిషిగా తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఫెడరేషన్ అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అందాలన్నా ప్రతీ ఒక సభ్యుడు ఖచ్చితంగా సభ్యత్వాలను కట్టి, పాతవారు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతీ సభ్యుడు ఈ-శ్రమ్ కార్డులు పొందాలన్నారు. తద్వారా కార్మికులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి అందే ప్రయోజనాలు పొందడానికి ఆస్కారం వుంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో సినిమా పరిశ్రమను ప్రమోట్ చేయడానికి అన్ని అవకాశాలను వినియోగిస్తూ.. ప్రభుత్వం దృష్టికి రాష్ట్రంలోని ఫెడరేషన్ సభ్యుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు.

మాజీ మున్సిపల్ చైర్మన్, నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జ్ అబ్బయ్య మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి కంచర్ల ఒక గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేస్తారని అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాలు సినిమాలకు అనువుగా వున్నాయని.. వాటిదగ్గర షూటింగులు జరిగితే ఫెడర్ రేషన్ సభ్యులందరికీ ఏడాది పొడవునా పనిదొరుకుతుందన్నారు. తాడేపల్లి గూడెం మాజీ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోయిన తరువాత సినీ పరిశ్రమకు ఒక వేదిక లేకుండా పోయిందని.. ఇపుడు ఆ బాధలు, ఆందోళన నుంచి ప్రతీ కార్మికుడు బయటపడే అవకాశం వచ్చిందన్నారు. ఒక ఉన్నతమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఫెడరేషన్ చైర్మన్ కావడం వలన ఇండస్ట్రీలోని ప్రతీ కార్మికుడికి మంచిరోజులు వచ్చినట్టేనని ఆశాభావం వ్యక్తం చేశారు.

వైస్ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఒక్కో జిల్లాకు ఒక్కో గుర్తింపు ఉందని సినీ నిర్మాతలు, దర్శకులు మంచి దృష్టితో ఆలోచించి రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ప్రాంతాల్లోనూ సినిమాలు తీయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ కి దేశంలోని సినిమాలన్నీ షూటింగ్ ల కోసం తరలివచ్చే అవకాశాలున్నాయన్నారు. ఆ విధంగా చేయడానికి డా. కంచర్ల అచ్యుతరావు నెట్వర్క్ పరిశ్రమకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యాసంస్థల చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ, అన్ని పరిశ్రమలలో మాదిరిగానే సినీ పరిశ్రమ కూడా అభివృద్ధి చెందాలన్నా.. ఇందులోకి కార్మికులకు చేతినిండా పనుండాలన్నా కంచర్ల లాంటి నిర్మాతలు ఏడాదికి కనీసం రెండుమూడు సినిమాలు తీయడం ద్వారా.. చాలా మంది నిర్మాతలు, దర్శకులు ఆంధ్రప్రదేశ్ లో సినిమాలు తీయడానికి ముందుకి వస్తారన్నారు. ప్రభుత్వంలో కూడా ఈయనకు పలుకుబడి ఉన్నందున కార్మికుల సమ్యలు పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందన్నారు.

ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరం రాజా మాట్లాడుతూ, తెలుగు సినీ పరిశ్రమలోని కార్మికులకు చాలా కాలం దిశ నిర్దేశం లేదని.. ఇపుడు కంచర్ల రాకతో ఒక చక్కటి విధానంతో అభివృద్ధి ఉపాది దిశగా ముందుకు వెళతామనే నమ్మకం బలపడిందన్నారు. ప్రతీకార్మికుడికి గుర్తింపు అనేది చాలా ముఖ్యమన్నారు. గుర్తింపుకోసం ఫెడరేషన్ నియనిబంధనలు పాటించి సభ్యులందరూ లైవ్ లో ఉండాలన్నారు. వైస్ ప్రెసిడెంట్ కొండపల్లి అప్పారావు మాట్లాడుతూ, చైర్మన్ డా.కంచర్ల అచ్యుతారు సూచించినట్టుగా ప్రతీ సభ్యుడూ ఈ-శ్రమ్ కార్డుతోపాటు, ఫెడరేషన్ సభ్యత్వాలు సత్వరమే చెల్లించి ప్రభుత్వం, ఫెడరేషన్ ద్వారా కలిగే ప్రయోజనాలు పొందాలన్నారు. అంతకు ముందు కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు డా.కంచర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 26 జిల్లాల కళాకారులు, డాన్స్ అకాడమీ సభ్యులు, గాయకులు, ఆడిషన్ సభ్యులు, ఉపకార్ ట్రస్టు సభ్యులు రాజా, సుధీర్, నాగు తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయలు పట్టుకొని నిరసన దీక్షలో పాల్గొన్న విద్యార్థులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంగళవారం రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వినూత్న రీతిలో కూరగాయలతో విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వి జాన్సన్ బాబు, జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు మెరుగైన వసతి , పౌష్టిక ఆహారం కల్పించడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్న క్యాంటీన్లో పెడుతున్న భోజనం మూడు పూటలకి 90 రూపాయలు అవుతుందని ప్రభుత్వం చెప్తుందని అటువంటిప్పుడు ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు 53 రూపాయలు ఏ విధంగా సరిపోతాయో ఆలోచించాలని అన్నారు. ప్రస్తుత ధరలకి అనుగుణంగా మెస్ చార్జీలు పెంచి పెండింగ్లో ఉన్న కాస్మోటిక్స్ మెస్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే శాశ్వత భవనాలు కేటాయించాలన్నారు.పీజీ విద్యార్థులు శాపం గా మారిన జీవో నెంబర్ 77 రద్దుచేసి ఫీజు రియంబర్స్మెంట్ వచ్చే విధంగా చూడాలని వారి కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేసి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సందర్భంగా తెలిపారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. అనంతరం విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంద్ర ప్రసాద్ గారిని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి మెనూ సక్రమంగా అమలు చేయని వార్డెన్స్ మరియు తనిఖీలు చేయని తదితర అధికారులపై చర్యలు తీసుకొనేలా ముందుకు వెళ్తామని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీను, జిల్లా సమితి సభ్యులు శేఖర్,గ్రేస్ ప్రకాష్, కిరణ్, మధు, యేసయ్య, నూతన్ ప్రసాద్, దివ్య విద్యార్థులు అధి సంఖ్యలో పాల్గొన్నారు.

# సంస్కరణల పేరుతో విద్యా వ్యవస్థ నాశనం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వైసిపి ప్రభుత్వం హయాంలో ఏడాదికో సంస్కరణ పేరు తో విద్యా వ్యవస్థను నాశనం చేశారని తెలుగునాడు విద్యార్థి స్టూడెంట్ ఫెడరేషన్ అనకాపల్లి నియోజకవర్గ అధ్యక్షులు పిట్ల హరీష్ ఘాటుగా విమర్శించారు. గత ఏడాది వైసీపీ సర్కారు గొప్పగా సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టి ఇంగ్లీష్ మీడియంలో ఉపాధ్యాయులకు సరైన శిక్షణ లేకపోవడంతో ప్రభుత్వం అనాలోచితంగా నిర్ణయం తీసుకోవడంతో 1000 ప్రభుత్వ పాఠశాలలో ఈ విధానం ప్రవేశపెట్టి ఘోరంగా విఫలమైందని హరీష్ అన్నారు. పరీక్షలకు హాజరైన 77 వేల మంది 65 శాతం మంది ఫెయిలయ్యారని జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీబీఎస్ఈ విధానం వికటించిందని టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మోహన్ కాంత్ జగన్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. తెలుగుదేశం పార్టీ మొదటినుంచి ఈ విధానాన్ని వ్యతిరేకించిందని, ముందుగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి దానికి తగిన విధంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ఇంగ్లీష్ బోధనపై అవగాహన కల్పించాలని చెప్పినప్పటికీ తాను చెప్పిన కుందేలుకి మూడే కాళ్లు అన్నట్లుగా వ్యవహరించారని ఆర్గనైజింగ్ కార్యదర్శి కసిరెడ్డి సాయికృష్ణ అన్నారు. మీడియా కోఆర్డినేటర్ గంధపు రాజు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత వైసిపి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో జరిగిన అవకతవకలను సరి చేస్తున్నారని, ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తీసుకొని విద్యాశాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటున్నారని, 117 జీవోను రద్దు చేయాలని విషయంపై ఆలోచన చేస్తున్నారని రాజు తెలిపారు.

## నగర పోలీస్ కమిషనర్ చొరవతో నమ్మి దొడ్డికి ఆర్టీసీ బస్సు సౌకర్యం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి 77వ వార్డు నమ్మి దొడ్డి జంక్షన్ లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని నమ్మిదొడ్డి ప్రాంతానికి బస్సు సౌకర్యం లేదని ప్రజలు సీపీకి తెలియజేయడంతో తక్షణమే స్పందించిన సీపీ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ తో మాట్లాడి గాజువాక డిపో నుంచి నమ్మి దొడ్డి జంక్షన్ వరకు బస్సును ప్రారంభించారు. గత నెలలో నమ్మి దొడ్డి ప్రాంతంలో దువ్వాడ సిఐ ఎర్రం నాయుడు ఆధ్వర్యంలో నగర పోలీస్ కమిషనర్, డీసీపీ 2 తుహిన్ సిన్హా తో ప్రజల సమస్యలపై ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి తో ప్రజలు తమ సమస్యలను వివరించగా తక్షణమే సిపి స్పందించి సోమవారం నాడు గాజువాక డిపో నుంచి నమ్మి దొడ్డి జంక్షన్ కు బస్సును ప్రారంభించారు. 77 వ వార్డులో ఉన్న సమస్యలు పరిష్కరించినందుకు నగర పోలీస్ కమిషనర్,అడిషనల్ కమిషనర్ కు జనసేన అధ్యక్షులు కాకి బాబు, ఉప అధ్యక్షులు నక్క శీను, వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ కమిషనర్ , ఎడిషన్ కమిషనర్, దువ్వాడ సిఐ కృతజ్ఞతలు తెలియజేశారు.

## వ్యాపార రంగానికి విశాఖ అనుకూలం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వ్యాపార రంగానికి విశాఖ నగరం ఎంతో అనుకూలమైనదని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. మంగళవారం మేయర్ దంపతులు కైలాసగిరి రోడ్డు విశాలాక్షి నగర్ లో 1990S మిల్ట్రీ హోటల్ గ్రాండ్ ప్రారంభోత్సవానికి కార్పొరేటర్ కోరుకొండ స్వాతి దాస్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నగర మేయర్ దంపతులు మాట్లాడుతూ విశాఖ నగరం ఎంతో అభివృద్ధి చెందుతున్న నగరమని, వ్యాపార రంగానికి విశాఖ నగరం అనుకూలమైనదని, విశాఖ నగరానికి వ్యాపారులు పెట్టుబడులు పెట్టి ఎంతో మందికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మన విశాలాక్షి నగర్ లో ఎంతో రుచికరమైన మిలిటరీ హోటల్ ప్రారంభించడం సంతోషమని, ఈ హోటల్ దినదిన అభివృద్ధి చెంది మరిన్ని నగరంలో ఇటువంటి హోటల్స్ ప్రారంభించాలని కోరుకున్నట్లు తెలిపారు.

## విత్తన బంతులతో పచ్చదనం పెంపొందించండి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విత్తన బంతులతో పచ్చదనం పెంపొందించండి అని కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు కోరారు. మంగళవారం ఉదయం సింహాచలం కొండ పైభాగంలో లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం విబిఎస్ ప్రసాద్ నేతృత్వంలో దేవతా వృక్షాలు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు విత్తనాలతో తయారు చేసిన విత్తన బంతులు చల్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కనీసం 10 మొక్కలు నాటాలని కోరారు. పచ్చదనం పెంపొందించే విధంగా కృషి చెయ్యాలి అన్నారు.

లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం విబిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ "హీల్ ఎర్త్ " అనె నినాదం తో తాము పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాం అన్నారు. ఈ సంవత్సరం పచ్చదనం పెంపొందించే విధంగా కృషి చెయ్యాలి అని నిర్ణయించుకుని విభిన్న కార్యక్రమాలు నిర్వహించడం జరిగుతోంది అన్నారు.

ఈ కార్యక్రమంలో నార్త్ ఈస్ట్ లైన్స్ ప్రెసిడెంట్ ఎం సురేష్, వనితా విభాగం ఎస్ సీతారత్నం, సింహాచలం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు వంకాయల నిర్మల, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## శిల్పి పరమేశ్వర రావుకు సత్కారం




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని దిబ్బ వీధిలో పునర్ నిర్మించిన శ్రీ నాగేంద్ర స్వామి సమేత శ్రీ కళ్యాణ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ శిల్పి శిల్పకళా రత్న విల్లూరి పరమేశ్వరరావును మాజీ శాసనమండలి సభ్యుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఘనంగా సత్కరించారు. సుమారు 20 లక్షల రూపాయలతో అధునాతనంగా నిర్మించిన ఆలయ కమిటీని ఈ సందర్భంగా నాగ జగదీశ్వరరావు అభినందించారు. అలాగే రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాల్లోనూ కూడా భారీ విగ్రహాలను నిర్మించి అనకాపల్లి పట్టణానికి పరమేశ్వరరావు వన్నె తెచ్చారని అన్నారు. అనేక ప్రాంతాల్లో శివపార్వతులు వీరాంజనేయ స్వామి గ్రామదేవతల విగ్రహాలు అత్యద్భుతంగా తయారుచేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో సామాజికవేత్త దొడ్డి వెంకట సత్యనారాయణ (బాబు), ఆలయ చైర్మన్ బొడ్డేడ రోషన్ కుమార్, ఎల్లపు సత్యనారాయణ, కాంద్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), యల్లపు గోవింద, పీవీ జగన్ మోహన్ రావు, మద్దాల వరహా నూకేశ్వరరావు, రాపేటి శ్రీను, కొణతాల సీతారాం, పాలిమేర నాయుడు, ఆళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## గుంకలాం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**విజయనగరం:** విజయనగరం మండలం గుంకలాం గ్రామంలో మంగళవారం సీతారాం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ, ఎస్ వి హాస్పిటల్ (కోట దారి) వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. గ్రామంలో ప్రజలకు ఉచితముగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితముగా పంపిణీ చేశారు. షుగర్, బిపి, జ్వరము, దంత సమస్యలు, గైనిక్, దీర్ఘకాల వ్యాధులకు ప్రముఖ వైద్యులు సేవలు అందించి సలహాలు ఇచ్చారు. గుంకలాం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు విజయనగరం సీతారాం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తలే సీతారాంను గ్రామ ప్రజా ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయనగరం మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, గ్రామ సర్పంచ్, డాక్టర్ కాళ్ళ సత్యనారాయణ ఆర్ఎంపి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జి అనిల్ కుమార్ ఎం ఎస్ ఎం సి హెచ్, డాక్టర్ టి శిరీష బి డి ఎస్, డాక్టర్ టి సుధీర్ ఎండి డి ఎం పుమాలజీ, డాక్టర్ ఎం నవ్య శృతి, ఎం డి ఎండోక్రైమలజీ, డాక్టర్ వి మనోజ్ ఎం స్ ఆర్థోపాలజీ తదితరులు వైద్య సేవలు అందించారు. ఉచిత శిబిరంలో 200 మంది పైగా రోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని సహకరం అందించారు.

## ఖింభోలాజ్ సాహిత్య సేవా సంస్థ కవి సమ్మేళనం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 27 ఆగస్టు 2024న, ఖంభోలాజ్ సాహిత్య సేవా సంస్థ ఉదయం 10.00 గంటలకు కవి సమ్మేళనాన్ని నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె. విశాఖపట్నం నుండి వి శర్మ హాజరైన నసీంబాను, బంకించంద్ర, కవి జమాభాయ్ ముస్కాన్, యోగితాబెన్ మోడీ, ప్రీతి పర్మార్ ప్రీత్, ఛగన్‌లాల్ మధు ముంబై, రాజేష్ తివారీ మఖాన్, డి.కె.దామోర్, అనంతరాయ్ చౌబే, వినోద్‌జీ, డా. వందన మధు. మీనా కుమారి పరిహార్ కృష్ణ అనే అంశంపై ఒక కూర్పును అందించారు. ఆర్గనైజేషన్ హెడ్ డాక్టర్ శైలేష్ వానియా శైల్ ద్వారా స్వరూప పరిచయం, కెవిన్ వానియా విన్ ద్వారా వేదిక మద్దతు, కవి ముస్కాన్ గుజరాత్ జాతీయ గీతం 11.45 గంటలకు ముగిసింది.

## నేటివరకు 40,421 టన్నుల ఇసుక సరఫరా

**విజయనగరం:** ఉచిత ఇసుక విధానం ప్రారంభించిన జూలై 8వ తేదీ నుంచి జిల్లాలో నేటివరకు 40,421 మెట్రిక్ టన్నుల ఇసుకను మూడు ఇసుక డిపోల ద్వారా వినియోగదారులకు సరఫరా చేసినట్లు గనులశాఖ ఉప సంచాలకులు సిహెచ్.సూర్యచంద్రరావు తెలిపారు. మంగళవారం ఒక్క రోజులోనే 49 ఆర్డర్‌లపై 677 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 46,430 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరాకు సిద్ధంగా వుందన్నారు.

## గ్రామ స్థాయి సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** గ్రామాలను అభివృద్ధి బాట పట్టించుటకు గ్రామ స్థాయి సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎం.పి.డి.ఓ)ను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు జిల్లా కలెక్టర్ మంగళ వారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకమన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసి అభివృద్ధి పనులు చేయడంలో సరైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆయన స్పష్టం చేశారు. సానుకూల దృక్పథంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. లక్ష్య సాధన దిశగా పనితీరు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మండలాల్లో సమగ్రమైన డేటా తయారు చేయాలని ఆయన సూచించారు. ఆరోగ్యం మెరుగు పరచడం, పౌష్టిక ఆహారాన్ని అందివ్వడం, సురక్షిత తాగు నీరు అందించడం వంటి అంశాలు కూడా అభివృద్ధిలో భాగమని ఆయన పేర్కొన్నారు. గ్రామ సచివాలయం సిబ్బంది సేవలు సంతృప్తికర స్థాయిలో ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. స్పష్టమైన లక్ష్యాలను వారికి నిర్దేశించాలని ఆయన అన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు ఎక్కడా జరగరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎం.పి.డి.ఓలు కూడా పర్యవేక్షణ చేయాలని ముఖ్యంగా తాగు నీటి వసతులు, మౌలిక వసతులు ఉన్న ప్రదేశాలు వద్ద నిర్దేశిత నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరగరాదని ఆయన అన్నారు. సెప్టెంబరు 15 నాటికి వర్మి కంపోస్టు కేంద్రాల నుండి ఉత్పాదకత ఉండాలని ఆయన ఆదేశించారు. దోమలు, వ్యాధులు వ్యాప్తి కాకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, సరైన పర్యవేక్షణ చేయాలని ఆయన అన్నారు. మున్సిపల్ కమిషనర్లు వార్డుల వారీగా అవగాహన కల్పించాలని, కమిటీలను నియమించాలని అన్నారు.

**జన్ మాన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి**

ప్రధాన మంత్రి జన్ మాన్ కార్యక్రమం క్రింద ఆదివాసీ గిరిజనుల (పి.వి.టి.జి) సర్వతోముఖ అభివృద్ధికి బాటలు వేయాలని ఆయన సూచించారు. పి.వి.టి.జిలకు పూర్తి స్థాయిలో పక్కా గృహాలు ఉండాలని, విద్య, వైద్య, తాగు నీరు, మౌలిక వసతులు విధిగా ఉండాలని ఆయన అన్నారు. ఆయా గ్రామాల్లో అవసరాలు గుర్తించాలని ఆయన ఆదేశించారు. ప్రధాన మంత్రి జన్ మాన్ కార్యక్రమం క్రింద పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన అన్నారు. ప్రతి సభ ఫలవంతం కావాలని ఆయన చెప్పారు. గ్రామస్తుల అవసరాలు గుర్తించాలని ఆయన సూచించారు. సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, ఆరోగ్య కార్డులు జారీ తదితర ప్రయోజనాలు ప్రతి అర్హుడికి అందాలని ఆయన ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి వి వెంకట రమణ, పార్వతీపురం ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి ఏ మురళీధర్, పార్వతీపురం, పాలకొండ మున్సిపల్ కమిషనర్లు కె శ్రీనివాస్, ఎస్ సర్వేశ్వర రావు, మలేరియా నివారణ కార్యక్రమం కన్సల్టెంట్ రామ చంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత ఆహార సేవ కార్యక్రమాన్ని ప్రారంభించినదొడ్డి బాబు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నిరుపేదలు, ఆపదలో ఉన్నవారికి సహాయం అందించాలనే ఒక సంకల్పంతో ఉచిత ఆహార సేవను ప్రారంభించినట్టు సామాజికవేత్త, దొడ్డి వెంకట సత్యనారాయణ ( బాబు) తెలిపారు. మంగళవారం స్థానిక దిబ్బ వీధి నాగేంద్ర స్వామి సమేత శ్రీ కళ్యాణ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద ఉచిత ఆహార సేవ కార్యక్రమానికి బాబు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని అన్నారు. మానవసేవే మాధవ సేవ గా భావించి ఈ బృహత్తర కార్యక్రమానికి చేయూత నివ్వాలని ఆయన కోరారు. త్వరలో భోజనాలు మంచి నీరు నిల్వ ఉంచేందుకు ఒక ఫ్రీజర్ను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. పండగలు పుట్టినరోజులు వంటి కార్యక్రమాలు చేసుకునేవారు మిగిలిన పదార్థాలను వ్యర్థంగా పారేయకుండా ఈ ఫ్రీజర్ లో ఉంచితే పలువురి ఆకలి తీర్చిన వారు అవుతారని ఆయన అన్నారు. బాబు చేసిన కార్యక్రమంతో తామంతా బాసటగా నిలుస్తామని తమ వంతు కార్యక్రమంలో పాలుపంచు కుంటామని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త యల్లపు సత్య నారాయణ అన్నారు. ఈ కార్యక్రమం ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో 40 మంది పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో బొడ్డేడ రోషన్ కుమార్, రాపేటి శ్రీనివాసరావు,పీలా గిరి, మద్దాల క్రాంతి కుమార్ కొణతాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 28 నుండి మేజర్ పోర్టుల దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మె




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పోర్టు & డాక్ ఎంప్లాయిస్ వేతన సవరణ, బోనస్ చెల్లింపు, పోర్టు హాస్పిటల్ మరియు పోర్టుల ఆస్తులను అమ్మరాదని తదితర డిమాండ్‌ల పరిష్కారానికి విశాఖ పోర్టు అడ్మిస్ట్రేషన్ బిల్డింగ్ దగ్గర మంగళవారం ధర్నా పోర్టు & డాక్ కార్మికులకు షరతులు లేని వేతన ఒప్పందం చేయాలని గత 3సం.ల బోనస్ బకాయిలను వెంటనే చెల్లించాలని, పోర్టు హాస్పటల్ మరియు ఆస్తులను అమ్మరాదని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మొదలగు డిమాండ్‌లు పరిష్కరించాలని పోర్టు ఫెడరేషన్ల నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు విశాఖ పోర్టులో బుధవారం నుండి దేశవ్యాప్తంగా జరిగే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అడ్మిస్ట్రేషన్ బిల్డింగ్ దగ్గర ఈ రోజు ధర్నా జరిగింది.

తేది : 01-01-2022 నుండి జరగాల్సిన కొత్త వేతన ఒప్పందం కోసం ఏర్పాటు చేసిన కమిటీ.

8 సమావేశాలు జరిగినా, 32 నెలలు పూర్తయినా న్యాయబద్ధమైన ఒప్పందం ఇప్పటికీ జరగలేదు. దీనికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మొండిగా అనేక అశాస్త్రీయమైన, అన్యాయమైన షరతులు పెట్టి ఒప్పందం జరగకుండా అటంకపడుతున్నది.

సమ్మె నోటీసు ఇచ్చిన తరువాత పోర్టు యాజమాన్యం (ఐపిఎ) 2% ఫిట్‌మెంట్ ఇస్తామని కొత్త ప్రతిపాదన ఇచ్చింది. ఇది పాత ప్రతిపాదన కంటే చాలా తక్కువ ఇవ్వడం దుర్మార్గం. కార్మికులను అవహేళన చేయడమే. ధరలని అదుపు చేయలేని ప్రభుత్వం కార్మికుల జీతాల పెంపుదలపై పరిమితి పెట్టడం దుర్మార్గం. వెంటనే ఎటువంటి షరతులేని సమంజసమైన వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేసారు. గత 3సం.రాల బోనస్‌ను వెంటనే సెటల్ చేయాలని కోరారు.

నేషనల్ ఎసెట్స్ మోనటైజేషన్ పైప్ లైన్ పథకం కింద మేజర్ పోర్టుల ఆస్తులను కార్పొరేట్ మరియు విదేశీ కంపెనీలకు అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం పెట్టింది. దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. కార్మికులకు, అధికారులకు, పెన్షనర్స్‌కు, ఆరోగ్య అవసరాలు తీరుస్తున్న పోర్టు హాస్పిటల్ సైతం పిపిపి క్రింద ప్రైవేట్‌కు అప్పజెప్పడాన్ని తప్పుపట్టారు. పోర్టు సొంత నిధులతో హాస్పిటల్‌లను అభివృద్ధి చేయాలని కోరారు. ఎంట్రీలెవల్ పోస్టులన్నింటిని భర్తీ చేయాలని డిమాండ్ చేసారు.

ఈ డిమాండ్‌ల పరిష్కారానికై ఆగస్టు 28 నుండి జరిగే దేశవ్యాప్త సమ్మెలో విశాఖ పోర్టు కార్మికులు, ఉద్యోగులు 100% సంపూర్ణంగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసారు.

పై డిమాండ్‌ల సాధనకై జరిగిన ధర్నాలో పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు బి.సి.హెచ్.మసేన్ (ఎఐటియుసి), కె.మంగయ్యనాయుడు (హెచ్ఎంఎస్) వి.ఎస్.పద్మనాభ రాజు, బి.లక్ష్మణరావు (సిఐటియు), జి.చందు (ఐఎన్‌టి యుసి), అఖాని (సిఎఫ్‌టియుఐ), రవి(బిఎంఎస్) తదితర నాయకులు మరియు కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

**తల్లిదండ్రుల బెడ్రూంలో గన్.. ప్రమాదవశాత్తు తనను తాను కాల్చుకున్న ఐదేళ్ల బాలుడు**

తల్లిదండ్రుల బెడ్రూంలో కనిపించిన తుపాకీ చూసిన ఐదేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు తనని తాను కాల్చుకున్నాడు. అమెరికాలోని చిన్న నగరగమైన సాల్ట్ లేక్‌లో జరిగింది ఘటన. ఆడుకుంటూ తల్లిదండ్రుల బెడ్రూంలోకి వెళ్లిన చిన్నారి అక్కడ తుపాకి చూశాడు. ఆపై దానిని తీసి ప్రమాదవశాత్తు తనను తాను కాల్చుకున్నాడు.

ఘటన జరిగినప్పుడు బయట ఉన్న బాలుడి తండ్రి కాల్పుల శబ్దం విని లోపలికి పరిగెత్తుకుని వెళ్లాడు. కిందపడిన కుమారుడికి సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసిందీ, లేనిదీ తెలియరాలేదు. విషయం తెలిసిన చాలామంది.. తల్లిదండ్రులకు ఇంత నిర్లక్ష్యం పనికిరాదని, ఆయుధాలు పిల్లలకు అందకుండా జాగ్రత్త వహించాల్సిన బాధ్యత వారిదేనని చెబుతున్నారు. కొందరు మాత్రం ఈ ఘటనకు పూర్తి బాధ్యత తల్లిదండ్రులదేనని అంటున్నారు.

## గీతా మందిరంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం లో ఉన్న శ్రీ గౌరీ పంచాయతన దేవాలయం శ్రీ గౌరీ గీతా నందు శ్రావణమాసం కృష్ణాష్టమి సోమవారం రాత్రి సందర్భంగా భక్తులు సహకారంతో వివిధ రకాల స్వీట్లు ఫలములతో స్వామివారిని అలంకరణ చేశారు. చిన్నారులు రాధాకృష్ణ వేషధారణ పోటీలు,ఉట్టు ఉత్సవం కోలాటకం భక్తి గీతాలు భక్తులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ల మహాలక్ష్మి నాయుడు, మళ్ల సూర్య ప్రకాష్ రావు, కృష్ణ మందిరం కన్వీనర్లు కొణతాల రాజాబాబు, వేగి సత్యవతి, ఆడారు లక్ష్మి, మల్ల అప్పియమ్మ, పాలకవర్గ సభ్యులు.

## సెప్టెంబర్ 1న పసుపు కొమ్ముల అలంకరణలో నూకాంబిక అమ్మవారి దర్శనం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ప్రజలు ఇలవేల్పు, ఆరాధ్య దైవం అనకాపల్లి శ్రీ నూకంబిక అమ్మవారి ఆలయంలో ఈ నెల ఒకటవ తేదీన చతుర్థి ఆశ్లేష నక్షత్రం కూడిన నాలుగవ ఆదివారం విశేషమైన రోజు సందర్భంగా నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారికి పసుపుకొమ్ములతో ప్రత్యేక అలంకరణ చేయబడుతుందని ఆలయ సహాయ కమిషనర్ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. అమ్మవారి అలంకరణ నిమిత్తం అవసరముకు పసుపు కొమ్ములు ఇచ్చేవారు ఆలయంలో పసుపు కొమ్ములు అందజేసి రసీద్ తీసుకోవాల్సింది ఆయన కోరారు. అదే విధంగా శ్రావణ మాసం సందర్భంగా నాలుగవ శుక్రవారం ఉదయం 8 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఉచితంగా నిర్వహించబడతాయని ఆసక్తిగల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ప్రసాద్ కోరారు.

## కృష్ణాష్టమి వేడుకలలో



**అరిలోవ, (విశాఖ సమాచారమ్):** 12వ వార్డు తోటగరువులో గల శ్రీ కృష్ణుడు ఆలయంలో జరిగిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు ముఖ్యధితిగా, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, రాష్ట్ర ఆర్గనైంగ్ సెక్రటరీ, ఒమ్మి సన్యాసిరావు హాజరయ్యారు. వీరికి వేదంపండితులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతంపలికి, ఆలయంలో వేదంపండితులు పూజలు చేసి ఆశీర్వచనములు అందచేశారు. ఈ పూజ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి, ఒమ్మి అప్పలరాజు, 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రాజశేఖర్ 12వ వార్డు అధ్యక్షులు, గాడి సత్యం, టీడీపీ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒమ్మి పాలారావు, పార్లమెంట్ సెక్రటరీ, ఏడువాక సన్యాసిరావు ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## మదనపల్లి సబ్ కలెక్టరేట్ లో వేకువజాము వరకూ సీఐడీ తనిఖీలు



అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో రికార్డుల దహనం కేసు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం అయిన విషయం తెలిసిందే. ఈ కేసును ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి సీఐడీకి అప్పగించింది. దస్త్రాల దహన ఘటనపై సీఐడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో భాగంగా సోమవారం రాత్రి 11 గంటల నుండి మంగళవారం వేకువజాము 3 గంటల వరకూ ఆఫీసులో తనిఖీలు నిర్వహించారు.

సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అదనపు ఎస్పీ రాజ్‌కమల్, డీఎస్పీ వేణుగోపాల్ బృందం తనిఖీలు చేపట్టింది. దస్త్రాల దహనం ఘటనకు సంబంధించి అధికారులు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. పోలీసుల అదుపులో ఉన్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్ తోపాటు, ప్రత్యక్ష సాక్షి నిమ్మనపల్లె వీఆర్ఏ రమణయ్య, ఘటన ముందు వరకూ ఆఫీసులో ఉన్న ఆర్‌డీఓ హరిప్రసాద్ లను సబ్ కలెక్టరేట్ కు పిలిపించి సీఐడీ అధికారులు విచారణ చేశారు.

# ప్రజలకు ఆరోగ్యభద్రత కల్పించండి



**విజయనగరం:** సీజనల్ వ్యాధులను అరికట్టి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తక్షణమే అన్ని రకాల చర్యలను తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్థాయి సంఘ సమావేశాలు జెడ్పి సమావేశ మందిరంలో మంగళవారం జరిగాయి. 1,2,4,7వ స్థాయి సంఘ సమావేశాలు జెడ్పి ఛైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన, 3వ స్థాయి సంఘ సమావేశం వైస్ ఛైర్మన్ బాపూజీనాయుడు అధ్యక్షతన, 5వ స్థాయి సంఘ సమావేశం ఆ సంఘ ఛైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల్లోని వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ముందుగా వైద్యారోగ్యశాఖపై చర్చ జరిగింది. మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు రెండు జిల్లాల్లో విపరీతంగా ఉన్నాయని, ప్రతీ ఇంటిలో జ్వర పీడితులు ఉన్నారని ఛైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం బట్లభద్ర గ్రామంలో ఇటీవల తల్లీకూతుళ్లు మరణించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇది చాలా దారుణమైన సంఘటన అనీ, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ఇటీవల జిల్లాలో స్వైన్‌ఫ్లూ కేసు కూడా నమోదయ్యిందని, వైద్యారోగ్యశాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. పిహెచ్‌సిలకు వెళ్తే పై ఆసుపత్రులకు రిఫర్ చేసేస్తున్నారని, ఇది సరైన పద్దతి కాదని అన్నారు. రెండు జిల్లాల వైద్యారోగ్య శాఖ అధికారులు మరింత అప్రమత్తం గా ఉండాలని, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలకు భరోసా నివ్వాలని ఆదేశించారు.

కురుపాం ఎంఎల్ఏ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ, డెంగీ, మలేరియా, విషజ్వరాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సీజనల్ వ్యాధుల విజృంభనకు కారణాలను కనుగొని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టిపెట్టి, దానిని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన మందులు, సెలైన్, పరికరాలు పిహెచ్‌సిల్లో నిల్వ ఉంచాలని, సకాలంలో వైద్యం అందించాలని సూచించారు.

విజయనగరం ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు విజృంభించకముందే,వాటిని అరికట్టేందుకు ముందుగానే చర్యలను తీసుకుంటే బాగుండేదని అన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కరువయ్యిందని చెప్పారు. వ్యాధుల విజృంభనకు కారణాలను ఇతర శాఖలపైకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆసుపత్రుల్లో ఒకే పడకపై ఇద్దరు రోగులను ఉంచే పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. వసతి చాలకపోతే తమ దృష్టికి తీసుకువస్తే, ప్రత్యామ్నాయం చూపేవారమని చెప్పారు.

ఎంఎల్‌సి పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్యం బాగులేదన్నారు. మంకీ ఫాక్స్ వ్యాధి కూడా కనిపించిందని చెప్పారు. గ్రామాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, వాటిని అరికట్టాలని సూచించారు.వైస్ ఛైర్మన్ బాపూజీ నాయుడు అధ్యక్షతన జరిగిన 3వ స్థాయి సంఘ సమావేశంలో వ్యవసాయ పరిసితిపై చర్చించారు. విజయనగరం జిల్లాలో బొండపల్లి, గజపతినగరం, విజయనగరం, గంట్యాడ మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదయ్యిందని, ఉబాలు పూర్తి కాలేదని తెలిపారు. సెప్టెంబరు మొదటి వారం వరకు అవకాశం ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించాలని, వెద జల్లేందుకు విత్తనాలను సిద్దం చేయాలని జెడ్పి ఛైర్మన్ సూచించారు. కౌలు రైతులందరికీ రుణాలు అందించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం ద్వారా పంట బీమా సదుపాయం కల్పించాలని కోరారు. ఎరువులను సకాలంలో సరఫరా చేయాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఎంఎల్ఏ అదితి విజయలక్ష్మి కోరారు. డిఆర్‌డిఏ, పౌర సరఫరాలశాఖపై చర్చించారు.

ఛైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన మహిళా శిశుసంక్షేమంపై చర్చ జరిగింది. జిల్లాలో ఎన్‌జిఓల ఆధ్వర్యంలో 43 అనాధ శరణాలయాలు, బాలల వసతి కేంద్రాలు ఉన్నాయని ఐసిడిఎస్ అధికారులు తెలిపారు. వీటన్నిటినీ తనిఖీ చేసి, అక్కడ వసతి, భద్రతా ఏర్పాట్లపై నివేదికను అందజేయాలని జెడ్పి ఛైర్మన్ ఆదేశించారు.

ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ శ్రీధర్‌రాజా, డిప్యూటీ సిఈఓ రాజ్‌కుమార్, రెండు జిల్లాల జెడ్పిటిసి సభ్యులు, కమిటీ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా భరత్ కుమార్ జన్మదిన వేడుకలు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక రింగ్ రోడ్డు ల ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం అత్యంత ఘనంగా జరిగాయి. పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకి రామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భరత్ కు శుభాకాంక్షలు తెలిపేందుకు పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచి వైసీపీ నాయకులు కార్యకర్తలు,భారీగా తరలివచ్చారు. అనంతరం వైసీపీ కుటుంబ సభ్యుల మధ్య భరత్ కుమార్ కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు.

భరత్ జన్మదిన వేడుకలకు హాజరైన మాజీ ఎంపి సత్యవతమ్మ,జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్,ఎంపీపీ గొర్లి సూరిబాబు,దంతులూరి దిలీప్ కుమార్ కార్పొరేటర్లు, మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి పిలా రాంబాబు, మాజీ దేవస్థానం చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ,ఆళ్ల నాగేశ్వరరావు, కె ఎం నాయుడు తదితరులు ఆయనకు గజ మాలలు వేసి,శాలువలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు,

ఆపై భరత్ చేతుల మీదుగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు మాట్లాడుతూ. నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన అతి తక్కువ సమయంలోనే ప్రజలు మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి భరత్ కుమార్ అని కొనియాడారు. గత ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఎక్కడ కూడా నిరుత్సాహం పడకుండా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పటికీ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తున్నారని కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నేనున్నాను అని ముందుంటున్నారని అన్నారు. భరత్ కుమార్ పుట్టినరోజు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వచ్చిన కార్యకర్తలు అభిమానులే ఆయన ఎన్నికల్లో ఓటమి చెందిన ఆయన పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనం అని పలువురు నేతలు కొనియాడారు.

# చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరి

**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మత్స్యశాఖ జిల్లా అధికారి పి.తిరుపతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల చెరువులు తీసుకునే వ్యాపారస్తులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ 2020 ప్రకారం లైసెన్స్ ల మంజూరు జరుగుతుందని ఆయన చెప్పారు.

ఇ-మత్స్యకార్ లాగిన్ లో గ్రామ మత్స్యశాఖ అసిస్టెంట్ ద్వారా ఆన్ లైన్ లో ధరఖాస్తు చేయాలని ఆయన తెలిపారు. దరఖాస్తుతో పాటు ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పున చెల్లించాలని, మండల సర్వేయర్ జారీ చేసిన ఆటోక్యాడ్ మ్యాపు, భూమి రెవెన్యూ అడంగల్, పట్టాదారు పాసుబుక్ లేదా లీజ్ అగ్రిమెంటు, పది రూపాయల బాండ్ పేపర్ పై 80 శాతం నిఖర చెరువు, 20శాతం గట్లు వేస్తానని హామీ ఇస్తూ అఫిడవిట్ ఉండాలని వివరించారు. అర్హత గల దరఖాస్తులకు జిల్లా, మండల స్థాయి కమిటీలు ద్వారా లైసెన్స్ ల మంజూరు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

# బెంగాల్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ.. మహిళా భద్రత కోసం మాట్లాడే స్వేచ్ఛ లేదా: జేపీ నడ్డా





పశ్చిమ బెంగాల్ పరిస్థితుల పట్ల ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వైఖరిపై భారతీయ జనతా పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కోల్‌కతాలో పోలీసుల అత్యుత్సాహ చర్యల పట్ల ప్రజాస్వామ్య సూత్రాలకు విలువనిచ్చే ప్రతి వ్యక్తికి కోపం తెప్పించేలా ఉన్నాయన్నారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సర్కార్, కోల్‌కతా పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై జేపీ నడ్డా మండిపడ్డారు. బెంగాల్‌లో రేపిస్టులు, నేరస్థులకు సహాయం చేయడానికి ఇచ్చే విలువ, మహిళల భద్రత కోసం దీదీ సర్కార్ ఇవ్వడం లేదన్నారు.

కోల్‌కతాలో విద్యార్థులు కదం తొక్కారు. డాక్టర్ హత్యాచారం ఘటనపై తమదైన శైలిలో నిరసన తెలిపారు. ఆందోళనకారులు బెంగాల్ సెక్రటేరియట్ ఉన్న నబానా వైపు దూసుకొచ్చారు. దీంతో పోలీసులు భాష్పవాయువును ప్రయోగించారు. నబానా వైపు వచ్చే అన్ని రోడ్లను దిగ్బంధించారు పోలీసులు. ఒక్కరిని కూడా అటు వైపు అనుమతించలేదు. విద్యార్థులకు తోడుగా పలు బీజేపీ కార్యకర్తలు కూడా ఆందోళనకు దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. నిరసనల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పోలీసుల తీరుపై బీజేపీ నేతలు మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలపడం ప్రజల హక్కు అని బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా అన్నారు. డాక్టర్‌పై అత్యాచారం కేసులో నిందితులను సీఎం మమతా బెనర్జీ కాపాడుతున్నారని ఆయన తీవ్ర విమర్శలు చేశారు.

కోల్‌కతాలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీ ఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుండి, భద్రతా లోపాలు వెలుగులోకి వచ్చాయి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్, పోలీసు కమిషనర్ వ్యవహరించిన తీరును సమర్థిస్తోంది. దర్యాప్తును ప్రభావితం చేసేందుకు కోల్‌కతా పోలీసులు అన్ని విధాలా ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే మహిళల భద్రతకు సంబంధించి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రశ్నలు సంధించింది. బెంగాల్ ప్రభుత్వం మహిళల భద్రతా చర్యలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఇప్పటి వరకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ప్రారంభించేందుకు రాష్ట్రం ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి అన్నారు. ఈమేరకు మమతా బెనర్జీకి లేఖ రాశారు కేంద్రమంత్రి. మహిళలు, పిల్లల భద్రతకు సంబంధించి కఠినచర్యలు తీసుకున్నారో వివరించాలని కోరారు.

ఇదిలావుండగా, తాజాగా మంగళవారం ఈ కేసులో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థుల 'నబన్న మార్చ్'లో భాగంగా సచివాలయ భవనాన్ని ముట్టడిస్తామని ప్రకటించింది. దీంతో కోల్‌కతా పోలీసులు సచివాలయం చుట్టూ గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. హౌరాలో ఉన్న నబన్న భవన్ రాష్ట్ర సచివాలయం వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పశ్చిమ బెంగాల్ ఛత్ర సమాజ్ అనే సంస్థ ఈ మార్చ్‌ను నిర్వహించింది. ఈ నిరసనలకు బీజేపీ కూడా మద్దతు తెలిపింది. రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు ఎలాంటి పార్టీ బ్యానర్ లేకుండా సోషల్ మీడియాలో నిరసనలో పాల్గొనాలని సామాన్య ప్రజలను ఆహ్వానించాయి. కాగా, శాంతియుతంగా సాగుతున్న ఈ నిరసనను అడ్డుకునే ప్రయత్నం చేయకూడదని పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సి.వి.ఆనంద్ బోస్ సోమవారం రాత్రి ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

ఈ నేపథ్యంలోనే కోల్‌కతాలో విద్యార్థులు కదం తొక్కారు. డాక్టర్ హత్యాచారం ఘటనపై తమదైన శైలిలో నిరసన తెలిపారు. నలు దిక్కుల నుంచి సెక్రటేరియట్ నబానాను ముట్టడించేందుకు ప్రయత్నించారు. 15 నిముషాలకు ఓసారి విడతల వారిగా విద్యార్థులు దూసుకురావడం.. 15 నిముషాలకు ఓసారి పోలీసులు భాష్పవాయువు ప్రయోగించడంతో హైటెన్షన్ నెలకొంది.

ఈ ప్రదర్శనను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర సచివాలయం పరిసర ప్రాంతాల్లో భద్రత కోసం 97 మంది సీనియర్ అధికారుల పర్యవేక్షణలో మొత్తం 2 వేల మంది పోలీసులను మోహరించినట్లు సమాచారం. ఇది కాకుండా, కోల్‌కతా, హౌరాను కలిపే ప్రదేశాలలో సుమారు 4,000 మంది పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిషనరేట్, జిల్లా విభాగాలకు చెందిన పోలీసు సిబ్బంది మోహరించారు.

అయితే, కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సెక్రటేరియట్‌ను ముట్టడించాయి విద్యార్థి సంఘాలు . విద్యార్థులకు , పోలీసులకు మధ్య పలు చోట్ల ఘర్షణ చెలరేగింది. మార్చ్‌లో పాల్గొన్న ఆందోళనకారులు, బారికేడ్లను బద్దలుకొట్టేందుకు ప్రయత్నించారు. ఆందోళకారుల పైకి పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీఛార్జ్ చేసి గాల్లోకి కాల్పులు జరిపారు. మరోవైపు ఈ ఆందోళనకు ఎలాంటి అనుమతి లేదని చెబుతున్నారు పోలీసులు.

కాగా, జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన మమత ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటున్న విద్యార్థి సంఘాలు..ముఖ్యమంత్రి మమతాబెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో పోలీసులు లాఠీచార్జ్ చేసినప్పటికి , భాష్పవాయువు ప్రయోగించినప్పటికి ఆందోళన కారులు వెనక్కి తగ్గలేదు. హౌరా బ్రిడ్జి దగ్గర బైఠాయించారు. కొన్ని ప్రాంతాల్లో పోలీసులపైకి ఆందోళకారులు దాడులకు తెగబడ్డారు. గాయపడ్డ పోలీసులను ఆస్పత్రికి తరలించారు. కోల్‌కతాలో లేడీ డాక్టర్ రేప్ అండ్ మర్డర్ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు భగ్గుమన్నాయి. డాక్టర్లు విధులను బహిష్కరించి ఆందోళనల్లో పాల్గొన్నారు.

# ఏయు నూతన రిజిస్టర్ ఆచార్య ధనుంజయరావుకు శుభాకాంక్షలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రతిష్టాత్మక ఆంధ్ర యూనివర్సిటీకి నూతన రిజిస్టర్ ఆచార్య ఈ ఎన్ ధనుంజయరావు బాధ్యతలు స్వీకరించినందుకు ఆంధ్ర యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రిజిస్టర్ ఆఫీసులోని తన చాంబర్ లో కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపినది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కోడి అర్జునుడు. మాట్లాడుతూ ఆచార్య ధనుంజయరావు రిజిస్టర్ గా ప్రభుత్వ నియమించటం మా కాంట్రాక్ట్ అధ్యాపకులకు శుభ సూచకమని గత 20 సంవత్సరాలుగా యూనివర్సిటీలో ఎన్నో బాధలను కష్టాలను ఓర్చుకుంటూ యూనివర్సిటీ కోసం నిరంతరం పనిచేస్తున్న మా యొక్క విషయాలు పై పూర్తి అవగాహన కలిగిన ఆచార్యులు రిజిస్టర్ గా రావటం మాకు చాలా ఆనందదాయకమని మా సమస్యలకు ఒక పరిష్కార మార్గం దొరుకుతుందని ఆశిస్తున్నాము అని తెలిపారు. కానీ కొన్ని పత్రికలలో మాజీ వైస్ ఛాన్సలర్ మనుషులకే మరలా కూటమి ప్రభుత్వం కూడా పట్టం కట్టింది అని ప్రచురించటాన్ని పూర్తిగా ఆంధ్ర యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ తరపున ఖండిస్తున్నాను. ఎందుకంటే ఆచార్య ధనుంజయ రావు ఒక అకాడమీపియన్ గా మరియు అడ్మినిస్ట్రేటర్ గా యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రపంచ స్థాయిలో గుర్తింపును తీసుకురావడానికి తనకున్న సామర్థ్యాన్ని నిరంతరం యూనివర్సిటీ కోసం కష్టపడే వారని ఆ క్రమంలోనే తనకు ఇచ్చిన బాధ్యతలను శిరసా వహిస్తూ అహర్నిశలు యూనివర్సిటీ సేవకు అంకితం అయ్యారని అంతేకాని వారిని మాజీ వైస్ ఛాన్సలర్ మనిషి అని ప్రచురించటం శోచనీయం అని దీనిని పూర్తిగా మరొక్కసారి ఖండిస్తున్నామని తెలియజేశారు. డైనమిక్ రిజిస్టర్ ని నియమించినందుకు ప్రస్తుత ఇంచార్జి వైస్ చాన్సలర్ ఆచార్య జి శశిభూషణరావుకు, విద్యాశాఖ మంత్రివర్యులకు మరియు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అలీ, ట్రెజరీ డాక్టర్ హరీష్, డాక్టర్ బి సుబ్బయ్య, డాక్టర్ సాల్మన్, డాక్టర్ రాము, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నరసింహమూర్తి డాక్టర్ దొర, డాక్టర్ రతన్ రాజు మరియు మహిళా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇన్ఫోసిస్ ఆన్లైన్ కోర్సులలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ





**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** ఇన్ఫోసిస్ నిర్వహించిన స్ప్రింగ్ బోర్డు ఆన్లైన్ కోర్సులలో స్థానిక గొల్లల పాలెం వద్ద గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. స్థానికం గా మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటన లో ప్రిన్సిపాల్ గంగా కుమారి పేర్కొంటూ ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు లో గల టైమ్ మేనేజ్మెంట్ ఎలక్ట్రానిక్ హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్, డ్రోన్, రోబోటిక్, కృత్రిమ మేధస్సు తదితర లేర్నిగ్ కోర్సుల్లో పాల్గొన్న పాఠశాల కు చెందిన విద్యార్థినులు బండారు ప్రవళిక (10 వ తరగతి), చప్పగడ్డ దీపిక(9 వ తరగతి) లు 100 సర్టిఫికేట్లు సాధించారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యాలయం లో జరిగిన కార్యక్రమం లో సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, జిసిడిఓ కలీషా బేగం, ప్రిన్సిపాల్ గంగా కుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.